



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 32 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 25 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# మృత్యు శకటం



## కర్నూలు సమీపంలో ఘోర బస్సు ప్రమాదం
## వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధం.. 19 మంది సజీవ దహనం

- బస్సు ఢీకొన్న బైకర్‌తో పాటు మొత్తం 20 మంది మృత్యువాత
- తెల్లవారుజామున 2.45 గంటలకు బైక్‌ను ఢీకొట్టిన బస్సు
- అక్కడికక్కడే మరణించిన బైకర్.. ఆపకుండా నిర్లక్ష్యంతో వేగంగా వెళ్లిన బస్సు డ్రైవర్
- బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్.. 300 మీటర్ల మేర లాక్కెళ్లిన బస్సు
- తీవ్ర రాపిడితో పగిలిన బైక్ పెట్రోల్ ట్యాంకు.. చెలరేగిన మంటలు
- చుట్టుముట్టిన మంటలు, దట్టమైన పొగతో దిక్కుతెలియక ప్రయాణికుల ఆర్తనాదాలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

బస్సు డ్రైవర్ చేసిన తప్పు 19 మంది సజీవ దహనానికి కారణమైంది! నిద్రలో ఉన్న వారిని శాశ్వత నిద్రలోకి పంపింది. కొన్ని కుటుంబాలను చిదిమేసి శాశ్వత చీకట్లు నింపింది. ఘటనా స్థలిని చూసిన వారి కంట నీరు తెప్పించింది. కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలతో పాటు యావత్ దేశాన్ని కలచి వేసింది. నిమిషాల వ్యవధిలో కొన్ని కుటుంబాలు, కొన్ని కుటుంబాల పెద్ద దిక్కులు, భవిష్యత్ ఆశలు అగ్నికీలలకు ఆహుతయ్యాయి. ప్రయాణికుల ఆర్తనాదాలు,చావు కేకలతో ఎన్‌హెచ్‌44 ఘీతిల్లింది. మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా బొగ్గు, మసిగా మారాయి. ఈ భీతావహ ఘటన స్లీపర్ బస్సు ప్రయాణాలపై మరోమారు పెద్ద చర్చనే లేవనెత్తింది. హైదరాబాద్ నుంచి గురువారం రాత్రి బెంగళూరుకు బయలు దేరిన వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ (స్కానియా) బస్సు (డీడీ 01ఎన్9490) శుక్రవారం తెల్లవారు జామున కర్నూలు సమీపంలో ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఏకంగా 19 మంది సజీవ - మిగతా2లో



# అప్పుల్లో మనమే టాప్

- కుటుంబ రుణాల్లో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ..దేశంలోనే దక్షిణాదిలో రుణాలు అధికం
- సామాజికవర్గాల ప్రకారం బీసీల్లో గరిష్ఠం.. ఎస్టీల్లో కనిష్ఠం.. కేంద్ర గణాంకాలశాఖ
- దక్షిణాది ప్రజలకు రుణ చెల్లింపు సామర్థ్యం ఎక్కువ.. నిపుణుల అభిప్రాయం
- అందుకనే రుణసంస్థలు అప్పులిస్తున్నాయ్.. నిపుణులు

5



# డిజిటల్ సేవలు టెలికం సైబర్ సెక్యూరిటీ

- డిజిటల్ సేవలు టెలికం సైబర్ సెక్యూరిటీ
- ఆయా సంస్థలన్నీ నిబంధనలు పాటించాల్సిందే
- టెలికం సైబర్ సెక్యూరిటీ నిబంధనలను
- నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం
- వాట్సాప్, జొమాటో, స్విగ్గీ, ఓలా, ఉబర్, ఫోన్

# త్వరలోనే ఫ్రీహోల్డ్‌కు స్వేచ్ఛ



- నిషేధం నుంచి భూములకు విముక్తి
- మంత్రివర్గ ఉపసంఘం కీలక చర్చ
- వచ్చే సమావేశంలో అధికారిక నిర్ణయం
- భూ కేటాయింపు విధానంలో కీలక మార్పులు
- ఇకపై ఇచ్చేది లీజు ప్రాతిపదికనే
- వక్ఫ్ అధికారులపై మంత్రుల ఆగ్రహం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధం త్వరలో తొలగిపోనుంది. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం వెలువరించనుంది. అతి త్వరలో రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన నేతృత్వంలో ఉపసంఘం సమావేశమైంది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, పయ్యావుల కేశవ్, పి.నారాయణ, కె.పార్థసారథి - మిగతా2లో



# మాతృభూమిని మరవొద్దు

- అందరం కలిసి పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలి
- గల్ఫ్‌లోని తెలుగు ప్రవాసులకు చంద్రబాబు పిలుపు
- నాడు మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు గేమ్ చేంజర్
- అలాగే నేడు గూగుల్ విశాఖకు, ఏపీకి తెలుగుజాతికి ప్రపంచంలో తిరుగులేదు
- ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా..తెలుగువారు ఉండాలన్నది నా కోరిక
- వారిని గ్లోబల్ సిటిజన్స్‌గా చూడాలనుకున్నాకానీ గ్లోబల్ లీడర్స్‌గా ఎదుగుతున్నారు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'జన్మభూమి.. కర్మభూమి.. ఈ రెండింటినీ ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. ఏ దేశంలో ఉంటే ఆ దేశ కట్టుబాట్లను, రాజ్యాంగాలను గౌరవించాలి. అదే సమయంలో అందరం కలిసి జన్మభూమి రుణం తీర్చుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. యూఏఈ పర్యటనలో భాగంగా చివరి రోజు శుక్రవారం దుబాయ్‌లోని లీమెరిడియన్ హోటల్‌లో జరిగిన ప్రవాస తెలుగు ప్రజల సభలో సీఎం ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా అక్కడ తెలుగువారు ఉండాలన్నది తన కోరికగా పేర్కొన్నారు. తెలుగువారిని గ్లోబల్ సిటిజన్స్‌గా చూడాలనుకున్నానని, కానీ వారు నేడు గ్లోబల్ - మిగతా2లో

# స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన



- తీవ్రంగా స్పందించిన జైశంకర్
- మైనార్టీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడాలన్న ఐరాస
- ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవన్న జైశంకర్
- ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని వ్యాఖ్య

5

# అడవులు జాతి సంపద.. ప్రతి అంగుళం అమూల్యం



- అడవుల ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించం
- శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు చల్లించేందుకు ప్రణాళిక
- దేశ అవసరాలకు తగిన కలప రాష్ట్రం నుంచి అందిద్దాం
- ఎకో టూరిజం ప్రోత్సాహంతో గిరిజన యువతకు ఉపాధి
- అటవీ శాఖను ఆదాయార్జన శాఖగా తయారు చేయాలి
- గ్రేట్ గ్రీన్ వాల్ రాష్ట్రానికి వరం కావాలి
- అటవీ శాఖ సిబ్బంది భద్రతకు అధిక ప్రాధాన్యం
- రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్‌షాప్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

అడవులు జాతీయ ఆస్తి. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. అడవుల రక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అడవులను రక్షించుకునే విషయంలో రాజకీయలకు తావుండదు. రాజీకి తావుండదు. అడవులు జాతి సంపద, ప్రతి అంగుళం అమూల్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడవుల రక్షణ విషయంలో మార్గదర్శకం చేస్తున్నారు. అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు కూడా అటవీ భూములను రక్షించే విషయంలో పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ మంత్రిగా ఉన్న వ్యక్తే తన సొంత ఇలాకాలోని అటవీ - మిగతా2లో



# పతనమైన ధరలు

- టంప్ ఒత్తిళ్లతో అమెరికా నుంచి మక్క దిగుమతులకు మోదీ సర్కారు యోచన
- అదే జరిగితే మన రైతన్నకు శరాఘాతమేనన్న నిపుణులు
- ఇప్పటికే దేశవ్యాప్తంగా పడిపోయిన ధరలు
- కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు
- దిగుమతితో దేశంలో ఇక మక్క సేద్యం ఉండదు

5

# రాష్ట్రానికి తుపాను ముప్పు!

## నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతోంది. శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెందే అవకాశముందని పేర్కొంది. తర్వాత సోమవారం నాటికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడుతుందని అంచనా వేసింది. ఇది తుపానుగా మారితే 'మొంథా (మొన్‌థా)'గా ఐఎండీ నామకరణం చేయనుంది. దీన్ని థాయ్‌లాండ్ సూచించింది. దీని ప్రభావంతో రాబోయే అయిదు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే - మిగతా2లో

# అడవులు జాతి సంపద.. ప్రతి అంగుళం అమూల్యం

-మొదటిపేజీ తరువాయి

భూములను ఇష్టానుసారం ఆక్రమించుకుంటే, అప్పటి వ్యవస్థలో అధికారులు ఎందుకు మిన్నకుండిపోయారో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. అలాంటి తప్పిదాలు కూటమి ప్రభుత్వంలో జరగడానికి వీల్లేదని, పార్టీలు, వ్యక్తులకు అతీతంగా అటవీ భూమి అంగుళం కబ్జా అయినా వేగంగా స్పందించాల్సిన బాధ్యతను అటవీ అధికారులు తీసుకోవాలని చెప్పారు. మండల పరిధిలోని కొండపావులూరులోని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆవరణలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల రెండు రోజుల వర్క్ షాప్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అడవుల సంరక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అటవీ శాఖలో విభిన్నమైన బాధ్యతలు పంచుకోవడానికి సరిపడినంత సిబ్బంది లేరని ప్రతి సమీక్షలోనూ అధికారులు నా దృష్టికి తీసుకువస్తున్నారు. ఈ సమస్య అధిగమించడానికి ఉన్న మార్గాలను కేబినెట్ ముందు ఉంచాం. సిబ్బంది నియామకం వ్యవహారంలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించాలి. ఎలాంటి సిఫార్సులకు తావివ్వవద్దు. అడవుల్ని సంరక్షించాలంటే అటవీ శాఖ అధికారుల భద్రత ప్రధానమైనది. అటవీ సిబ్బంది భద్రత పట్ల కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి స్పష్టతతో ఉంది. విధి నిర్వహణలో ఉన్న అధికారులను ఇబ్బందిపెట్టినా, దాడులకు పాల్పడినా అది ఏ స్థాయి వ్యక్తులైనా వారిని ఉపేక్షించం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. విధి నిర్వహణలో ఇబ్బందులు ఉంటే వ్యక్తిగతంగా నన్ను కలిసి సమస్యను చెప్పండి. శ్రీశైలం ఘటన నా దృష్టికి వచ్చిన వెంటనే నిజానిజాలు తెలుసుకున్నాను. సిబ్బందికి తగిన న్యాయం జరిగేలా చూశాం. విధి నిర్వహణ విషయంలో ఎలాంటి భయాలకు తావివ్వవద్దు.

రాష్ట్రవ్యాప్తంగా 22 శాతం భూ భాగంలో నోటిఫై చేసిన అడవులు ఉన్నాయి. డి-నోటిఫై చేసిన దానితో కలిపితే మొత్తం 31 శాతంగా ఉండవచ్చు అని అంచనా. అయితే ఉన్న అడవుల్లో ఎంత పచ్చదనం ఉంది? ఆక్రమణల నేపథ్యంలో ఎంత శాతం అడవులు మిగిలాయి అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై సమగ్ర సర్వే చేసి ఇతర శాఖలను సమన్వయం చేసుకుని అటవీ భూములను స్వాధీనం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. ఆక్రమణలు ఎక్కడ ఉన్నా, చేసింది ఎవరైనా ఉపేక్షించవద్దు. 2047 నాటికి రాష్ట్ర భూ భాగంలో 50 శాతం పచ్చదనంతో నిండేలా పని చేయాలి. దీనికి ప్రజల భాగస్వామ్యం అవసరం. భావితరాలకు పచ్చదనాన్ని పెంపొందించేలా చైతన్యవంతులను చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలం. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం మనది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంత రక్షణకు మడ అడవుల పెంపకం ప్రధానం. తీరం వెంబడి ఖాళీ ప్రదేశాల్లో తాటి చెట్లు, పాల్మిరా, పాడనస్ వంటి తీర ప్రాంత జాతుల మొక్కలు పునరుద్ధరణపై దృష్టి సారించి ఆకు పచ్చని గోడ నిర్మాణానికి కాల వ్యవధి పెట్టుకుని పని చేద్దాం. దీని వల్ల తీర ప్రాంతాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి బతుకు భరోసా లభిస్తుంది. అలాగే తుపాన్లు, సునామీల వంటి విపత్తుల నుంచి సహజ సిద్ధమైన రక్షణ పొందవచ్చు. సముద్ర జీవ జాతులను కాపాడవచ్చు. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. సంవత్సరానికి 10 అడుగులకు పైగా సముద్ర గర్భంలో కలసిపోతుంది. ఇలాంటి కోతలను కూడా మడ అడవుల పెంపకం ద్వారా నివారించవచ్చు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆంధ్రప్రదేశ్ అనేది ఒక గొప్ప ప్రయత్నంగా ప్రారంభిస్తున్నాం. దీన్ని ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. లక్ష్యాన్ని అధిగమించేలా పనిచేయాలి. శేషాచలం అడవుల్లో 1987 ప్రాంతంలో హెలీకాప్టర్ల ద్వారా విస్తారంగా ఎర్రచందనం విత్తనాలు చల్లారు. అది రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి బీజాలు వేసింది. ఆ తర్వాత అలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇప్పుడు మరోసారి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు విస్తారంగా చల్లే కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం. దీంతోపాటు ఎర్ర చందనం స్మగ్లింగ్ నిరోధంతోపాటు ఇతర రాష్ట్రాల్లో పట్టుబడుతున్న ఎర్రచందనాన్ని తిరిగి రాష్ట్రానికి రప్పించే చర్యలు తీసకుంటున్నాం. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్లిన సందర్భంగా ఆ రాష్ట్ర అటవీ అధికారులు మన రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుకున్న రూ.110 కోట్ల ఎర్ర చందనాన్ని పట్టుకుని వేలం వేసుకున్నట్టు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. అందుకోసం అధునాతన సాంకేతికతను ఉపయోగించుకుని ప్రభావవంతంగా పని చేయాల్సిన అవసరం ఉంది. బ్రిటీష్ హయాంలో అడవులు ఆదాయ మార్గాలుగా ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. మన దేశ అవసరాల కోసం ఏటా రూ.22 వేల కోట్ల విలువైన 900 లక్షల క్యూబిక్ మీటర్ల కలపను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అడవులను కాపాడుకుంటూనే, డీనోటిఫై చేసిన ప్రాంతాలను కలప పెంపకానికి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్రదేశం ఉన్న ప్రతి చోటా కలప పెంచాలి. అవసరం అయితే పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యా శాఖలను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టాలి. అడవి ఆదాయ వనరుగా ఉంటేనే సిబ్బంది కొరత సమస్యను అధిగమించగలం. దేశానికి అవసరం అయ్యే కలపను రాష్ట్రం నుంచి అందించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకోవాలి. ఉడ్ బ్యాంక్స్ ఏర్పాటు, ఎకో టూరిజం మీద దృష్టి సారించాలి. పర్యావరణాన్ని రక్షించుకుంటూ ఎకో టూరిజాన్ని ప్రోత్సహించాలి. తద్వారా గిరిజన యువతకు ఉపాధి మార్గాలు కల్పించాలి. అడవులను కాపాడుకుంటూ, గిరిజనుల జీవనాధారానికి ఇబ్బంది కలగకుండా చూడాలి. అడవుల అందాలను ప్రజలు ఆస్వాదించే ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంపై దృష్టి సారించాలి. అది భవిష్యత్ పర్యాటక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీకి ముడి కలప కొరత ఉంది. అంకుడు, తెల్ల పొనికి చెట్లను విస్తృతంగా పెంచి ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీకి ఇబ్బందులు లేకుండా చూడాలి. కళాకారుల అవసరానికి తగినంతగా సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కొండపల్లి బొమ్మల తయారీకి వినియోగించే తెల్లపొనికి చెట్ల పెంపకం సవాలుతో కూడుకున్న వ్యవహారం. అవి చాలా నెమ్మదిగా పెరుగుతాయి. వీటి వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలి. ఒక పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని ముందుకు తీసుకువెళ్లాలి. రాష్ట్ర సరిహద్దు జిల్లాలు అయిన చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మదపుటేనుగుల సంచారం ఎక్కువగా ఉంది. చిత్తూరు జిల్లాలో సమస్య పరిష్కారానికి కర్ణాటక నుంచి కుంకి ఏనుగులు తీసుకువచ్చాం. శ్రీకాకుళంలో తొమ్మిది ఆడ ఏనుగులు సంచరిస్తున్నట్టు సమాచారం ఉంది. ఇవి ఒడిశా నుంచి వచ్చాయి. ఒడిశాలో మైనింగ్ పెరిగిపోవడంతో అవి ఇటు వైపు వలస వచ్చినట్టు తెలుస్తోంది. మన రాష్ట్రంలో అవి తిరుగుతున్న ప్రాంతం మొత్తం పంట పొలాలున్న ప్రాంతం. ఈ సమస్య పరిష్కారానికి అవసరం అయితే ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడి వాటిని తిరిగి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం. అడవుల సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, గిరిజనుల కోసం ఏదైనా చేయాలన్న తపన, నిబద్ధతతో పని చేయాలని ముందుకు వచ్చే అధికారులకు కూటమి ప్రభుత్వం తరపున మావంతు సహకారం అందిస్తాం. అడవులను కాపాడుకుంటూ, జీవ వైవిధ్యాన్ని పెంపొందించుకుంటూ పచ్చని హరితాంధ్రప్రదేశ్ నిర్మిద్దాం" అన్నారు. ఈ సందర్భంగా గ్రేట్ గ్రీన్ వాల్ ప్రచార పోస్టర్లు అధికారులతో కలిసి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. అంతకు ముందు ఎన్ఐఆర్డీలోని నక్షత్ర వనాన్ని పరిశీలించి ప్రతి మొక్క వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. జమ్మి చెట్టును నాటారు.

కార్యక్రమంలో తొలిగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. సుస్థిరమైన అభివృద్ధిని సాధించుకుంటూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలనేది స్వర్ణాంధ్ర విజన్ 2047 ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. అటవీ శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థల సమన్వయంతో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన ప్రణాళికలను అవగాహన కల్పించుటలో ఈ కార్యశాల ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

తొలుత, కార్యక్రమానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రికి రాష్ట్ర పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతికత ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (అటవీ) పి.మల్లిఖార్జునరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్ఐడిఎం దక్షిణ క్యాంపస్ జాయింట్ డైరెక్టర్ కల్నల్ పియస్ రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ అధిపతి డాక్టర్ పీవీ చలపతిరావు, అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్స్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ శాంతిప్రియ పాండే, రాహుల్ పాండే, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు తదితర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలు జిల్లాల అటవీ శాఖ అధికారులు, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మృత్యు శకటం

-మొదటిపేజీ తరువాయి

దహనమయ్యారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... మొత్తం 44 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లతో హైదరాబాద్‌లో బయలుదేరిన బస్సు శుక్రవారం తెల్లవారుజామున 2.14 గంటలకు కర్నూలు సమీపంలోని పుల్లూరు టోల్ ప్లాజా దాటింది. 2.30 గంటలకు టాయిలెట్ కోసం కర్నూలులో ఆపారు. కొంత మంది మాత్రమే బస్సు దిగారు. మిగిలిన వారంతా గాఢనిద్రలో ఉన్నారు. ఆ తర్వాత బయలుదేరిన బస్సు చిన్నటేకూరు దాటగానే 2.45 గంటలకు ఓ బైక్‌ను ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న శివశంకర్ అనే యువకుడు అక్కడికక్కడే చనిపోయాడు. అయితే ప్రమాదం తర్వాత కూడా ఆపకుండా డ్రైవర్ బస్సును ముందుకు నడిపాడు. ఇదే పెను ప్రమాదానికి కారణమైంది. ఆ సమయంలో బస్సు 100 కిలోమీటర్ల వేగంతో వెళుతోంది. బైక్‌ను ఢీకొట్టిన తర్వాత ముందుకు వెళ్లిపోతే ప్రమాదం తమపైకి రాదని భావించిన డ్రైవర్ బస్సును వేగంగా నడిపారు. శివశంకర్ రోడ్డు పక్కన పడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కింద ఇరుక్కుపోయింది. దీంతో బస్సు బైక్‌ను 300 మీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. ఆ రాపిడికి మంటలు రేగాయి. ఈ క్రమంలో బైక్ పెట్రోల్ ట్యాంకు పగిలిపోయి మంటలు చెలరేగాయి. బస్సు ఎడమ వైపు డోర్ల భాగంలో మంటలు కనిపించాయి. అప్పుడు డ్రైవర్ బస్సును ఆపాడు. డ్రైవర్ లక్ష్మయ్యతో పాటు మరో డ్రైవర్ వాటర్ బాటిళ్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈలోపు ముందు భాగంతోపాటు బస్సు మధ్య భాగంలో కూడా మంటలు వ్యాపించాయి. బైక్‌ను ఢీకొట్టడంతో బస్సు డోర్‌లోని సెన్సార్ వైర్లు తెగిపోయాయి. దీంతో డోర్ పూర్తిగా లాక్ అయి తెరుచుకోలేదు. దీంతో డ్రైవర్లు భయపడి ప్రాణాలు కాపాడుకునేందుకు బస్సులోంచి దూకేశారు. మంటల ధాటికి దట్టమైన పొగ బస్సు మొత్తం కమ్ముకుంది. ఒకరి ముఖం మరొకరికి కన్పించని పరిస్థితి. పొగ, మంటల ధాటికి ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఊపిరాడక ఆర్తనాదాలు పెట్టారు. క్షణాల్లో మంటలు డోర్ కర్టన్లు, బెడ్‌షీట్లు, బెడ్లకు అంటుకుని అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. కొందరు మాత్రం బస్సు అద్దాలు పగులగొట్టి కిందకు దూకి గాయాలతో బయటపడ్డారు. తక్కిన వారు ప్రమాదం నుంచి తప్పించుకోలేక అగ్నికి ఆహుతయ్యారు. బస్సు మొత్తం నిమిషాల వ్యవధిలో పూర్తిగా దగ్ధమైంది. జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులు ప్రమాద ఘటనను వీడియో, ఫొటోలు తీసి పోలీసు అధికారులకు పంపారు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్‌తో మంటలను అదుపు చేశారు.

హైదరాబాద్‌లో బస్సు ఎక్కడానికి 40 మంది టికెట్ బుక్ చేసుకున్నారు. వీరిలో ఒకరు వ్యక్తిగత కారణాలతో ప్రయాణం రద్దు చేసుకోవడంతో బస్సు ఎక్కలేదు. మిగతా 39 మందితోపాటు నలుగురు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ లెక్కన 43 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆపై హైదరాబాద్ శివారు ప్రాంతం ఆరంఘర్‌లో టికెట్ ముందుగా బుక్ చేసుకోని ఒకరు బస్సు ఎక్కారు. ఇద్దరు డ్రైవర్లతో కలిపి బస్సులో 46 మంది ఉన్నారు. వీరిలో ఒకరు మాత్రమే కర్ణాటకలోని బాగేపల్లిలో బస్సు దిగాల్సి ఉంది. మిగతా వారంతా బెంగళూరుకు వెళ్లాల్సిన వారే. వీరిలో ప్రమాదం తర్వాత 27 మంది ప్రాణాలతో బయట పడ్డారు. ప్రమాద సమయంలో అద్దాలు ధ్వంసం చేసి దూకడంతో పాదాలు, కాళ్లకు గాయాలయ్యాయి. కొంత మందికి తలపై కూడా చిన్నచిన్న గాయాలయ్యాయి. వీరిలో 23 మంది పెద్దవాళ్లు, ఇద్దరు పిల్లలు కాగా.. మరో ఇద్దరు డ్రైవర్లు. తక్కిన 19 మంది చనిపోయారు. మృతుల్లో 17 మంది పెద్దలు, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులను పోలీసులు 108లో కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇంకొందరు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు.

**బస్సు ప్రమాద ఘటనపై కేసు నమోదు**

కర్నూలు సమీపంలోని కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద వేమూరి కావేరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనపై ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రయాణికుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు యాజమాన్యంపై 125 (ఎ), 106 (1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఉలిందకొండ పీఎస్ ఎస్ఐ ధనుంజయ తెలిపారు. బస్సు డ్రైవర్లు శివనారాయణ, మిరియాల లక్ష్మయ్యను అదుపులోకి తీసుకుని ప్రమాద ఘటనకు దారితీసిన కారణాలపై విచారిస్తున్నారు.

**పనికి వెళ్లొస్తానని అటే వెళ్లిపోయాడు..**

అమ్మా డోన్ వద్ద పని ఉందంట. మాట్లాడుకుని మళ్లీ వస్తానని రాత్రి పోయినోడు మళ్లీ రాకుండానే పోయినాడు...అంటూ ఆ తల్లి గంటల తరబడి మార్చురీ వద్ద విలపిస్తున్న దృశ్యం కంటతడి పెట్టిస్తోంది. కర్నూలు జిల్లా కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు గ్రామానికి చెందిన నాగన్న కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆయన భార్య యశోదమ్మ ఇద్దరు కుమారులను పెంచి పెద్ద చేసింది. ఇందులో పెద్దవాడైన శ్రీహరి గౌండా పనిచేస్తుండగా చిన్నవాడైన శివశంకర్ గ్రానైట్ పనులకు వెళ్లేవాడు. శివశంకర్ ఎప్పటిలాగే గురువారం రాత్రి కూడా డోన్ వద్ద పని ఉందని మాట్లాడుకుని వస్తానని వెళ్లాడు. ఆ తర్వాత మళ్లీ తల్లికి ఫోన్ చేయలేదు. ఉదయం లేచే సరికి బైక్‌పై వెళుతూ బస్సు కింద పడి శివశంకర్ మృతిచెందాడని పోలీసులు చెప్పడంతో ఆ తల్లి గుండెలవిసేలా విలపించింది.

**అద్దాలు పగలగొట్టినా బయటకు రాలేని పరిస్థితి**

స్లీపర్ కోచ్ బస్సులో లోయర్, అప్పర్ బెర్త్‌లు ఉన్నాయి. అప్పర్ బెర్త్‌లో ఉన్నవారు అద్దాలు పగలగొట్టి సులభంగా బయటకు దూకారు. గాయాలతో బయటపడ్డారు. అప్పర్ బెర్త్ అద్దాలు ధ్వంసం చేస్తే బయటకు దూకేయొచ్చు. కానీ లోయర్ బెర్త్‌లో అద్దాలు ధ్వంసం చేసినా, ఐరన్ యాంగ్లర్లు అడ్డుగా ఉన్నాయి. దీంతో మనిషి దూరలేని పరిస్థితి! అప్పర్ బెర్త్ లాగే, లోయర్ బెర్త్‌లు కూడా ఉండి ఉంటే అద్దాలు ధ్వంసం చేసి ఇంకొందరు కిందకు దూకి ప్రాణాలతో బయట పడే అవకాశం ఉండేది.

**గుర్తుపట్టలేని విధంగా మృతదేహాలు**

తెల్లవారుజామున 3.30 గంటలకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఇతర పోలీసులు బస్సును పరిశీలించారు. ఇనుప కడ్డీలు మినహా బస్సులో ఏమీ మిగల్లేదు. నల్లటి మసి దిబ్బలు మాత్రమే కన్పించాయి. తెల్లవారిన తర్వాత కలెక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్లా, డీఐజీ కోయ ప్రవీణ్‌తో పాటు వైద్యాధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు వచ్చారు. వీరి సమక్షంలో బూడిదను తొలగించి.. నల్లగా బొగ్గులా మారిన మాంసపు ముద్దలను అతి కష్టం మీద వెలికి తీశారు. మొత్తం 19 మృతదేహాలను ప్రత్యేక టెంట్‌లో ఉంచారు. వాటి నుంచి ఫోరెన్సిక్ అధికారులు డీఎన్ఏ పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకున్నారు. మృతదేహాలకు వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఆ తర్వాత మృతదేహాలను కర్నూలు జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. 14 మంది మృతుల కుటుంబ సభ్యుల డీఎన్ఏ శాంపుల్స్ కూడా వైద్యులు సేకరించారు.

**బస్సు ఆపి ఉంటే ప్రమాదం తప్పేది**

బస్సు బైక్‌ను ఢీకొట్టిన వెంటనే నిలిపేసి ఉంటే అసలు ప్రమాదమే జరిగేది కాదు. బైక్‌పై ప్రయాణించే శివశంకర్ మాత్రమే చనిపోయేవాడు. అయితే, ప్రమాదం తమపైకి రాకుండా ఉండేందుకు డ్రైవర్ లక్ష్మయ్య బస్సును అదే వేగంతోనే నడిపాడు. దీంతో బైక్ బస్సు కింద ఇరుక్కుపోవడం, 300 మీటర్ల మేర రోడ్డుకు రాపిడికి గురై పెట్రోలు ట్యాంకు పగలడం, మంటలు చెలరేగి బస్సుకు వ్యాపించడంతో పెను ప్రమాదం సంభవించింది.

## మాతృభూమిని మరవొద్దు

-మొదటిపేజీ తరువాయి

లీడర్స్‌గా ఎదుగుతుండడం గర్వంగా ఉందన్నారు. 2047 నాటికి హెల్తీ.. వెల్తీ.. హ్యాపీ స్వర్ణాంధ్రప్రదేశ్ తన లక్ష్యమని.. దానికి అందరూ సహకరించాలని కోరారు. ఇంకా చంద్రబాబు ఏమన్నారంటే..

**అత్యంత ప్రభావవంతమైన జాతి..**

నేను 30 ఏళ్లుగా దుబాయ్ వస్తున్నా.. ఇప్పుడు మీలో చూస్తున్న ఉత్సాహాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. 1995లో నేను సీఎం అయినప్పుడు తెలుగువారందరికీ ఒకే మాట చెప్పేవాడిని.. మీ పిల్లలకు ఆస్తులివ్వడం కన్నా మంచి చదువు చెప్పించండని చెప్పేవాడిని. ప్రపంచాన్ని జయించగల సత్తా తెలుగువారిది. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్టను తీసుకొచ్చాను అందులో ఉద్యోగం చేయడానికి వెళ్లిన సత్య నాదెళ్ల నేడు అదే సంస్థకు సీఈవోగా ఉన్నారు. ఆయన ఏడాది జీతం రూ.850 కోట్లు. తెలుగుజాతికి తిరుగులేదన్నది నా ప్రగాఢ విశ్వాసం. ప్రపంచంలో నంబర్ వన్‌గా జాతిగా.. అత్యంత ప్రభావవంతమైన జాతిగా నిలుస్తుందనడంలో సందేహమే లేదు. 2024 ఎన్నికల్లో మీరంతా వచ్చి కూటమి విజయానికి సొంత డబ్బులు ఖర్చు పెట్టి మరీ పనిచేశారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర పునర్నిర్మాణానికి నేను, పవన్ కల్యాణ్.. ప్రధాని మోదీ నేతృత్వంలో పనిచేస్తున్నాం.

**అప్పుడు మైక్రోసాఫ్ట్.. ఇప్పుడు గూగుల్**

హైదరాబాద్ 25 సంవత్సరాల క్రితం ఎలా ఉంది.. ఇప్పుడెలా అభివృద్ధి చెందింది..? దానికి కారణం టీడీపీ. అప్పుడు హైదరాబాద్ గేమ్ చేంజర్‌గా మైక్రోసాఫ్ట్.. ఐటీ ప్రమోషన్ పనిచేశాయి. ఇప్పుడు గూగుల్, కృత్రిమ మేధ (ఏఐ).. విశాఖ, ఏపీకి గేమ్ చేంజర్‌గా నిలవనున్నాయి. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. త్వరలోనే ఏపీ దశదిశ మారనుంది. ఒక రైతుకూలీ బిడ్డ ఐటీ ప్రొఫెషనల్ అయ్యాడంటే ఆ ఘనత టీడీపీది. క్వాంటమ్ వ్యాలీ ఉండే ఏకైక దేశం భారతదేశం.. అది కూడా ఆంధ్రప్రదేశ్. ఎప్పటికప్పుడు ఆలోచనలు మారుతూ ఉండాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. అబూధాబీ ఒకప్పుడు ఆయిల్ ఎకానమీపై ఆధారపడి ఉండేది.. ఇప్పుడు నాలెడ్జ్ ఎకానమీగా, పర్యాటక రంగం వైపు అడుగులు వేస్తోంది. 1.50 లక్షల హోటల్ గదుల సామర్థ్యంతో ఆతిథ్య రంగాన్ని తయారు చేసుకోవడంతో దుబాయ్‌కి పెద్ద ఎత్తున ఆదాయం వస్తోంది.

**ఐటీతో విప్లవాత్మక మార్పులు**

గతంలోలా హార్డ్ వర్క్ చేయాల్సిన పనిలేదు.. స్మార్ట్ వర్క్ చేసే రోజుల్లో ఉన్నాం. ఏపీలో ఐటీని ఉపయోగించుకుని విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాం. 16 నెలల్లోనే 750 సేవలను వాట్సాపలో తీసుకొచ్చాం. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ వచ్చే జనవరి నుంచి పనిచేయనుంది. తిరుపతి సమీపంలో స్పేస్ సిటీ పెట్టి శాటిలైట్ సర్వీసులను ప్రపంచానికి అందజేసేందుకు సిద్ధమవుతున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. భవిష్యత్‌లో ఎయిర్ ట్యాక్సీలను తయారుచేసి దుబాయ్‌కి కూడా అందించే పరిస్థితికి వస్తాం. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. రాబోయే 10 ఏళ్లలో వినూత్న మార్పులు రాబోతున్నాయి. దేశంలోని ప్రతి పౌరుడి డేటాతో డేటాలేక్ రూపొందిస్తున్నాం. ఎడారిగా ఉండే దుబాయ్‌నే ఇక్కడి పాలకులు స్వర్గంలా చేశారంటే అన్ని ఉన్న భారతదేశం ఏ స్థాయిలో అభివృద్ధి చెందాలో ఆలోచించండి.

**అనూహ్య స్పందన..**

తెలుగు ప్రవాసుల సభకు అనూహ్య స్పందన లభించింది. గల్ఫ్ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో వారు తరలివచ్చారు. కువైట్, ఒమాన్, బహ్రెయిన్, ఖతార్ దేశాల నుంచి పెద్ద ఎత్తున తెలుగువారు తరలి రావడంతో సమావేశ మందిరం కిటకిటలాడింది. కార్యక్రమానికి హాజరైన తెలుగువారందరితోనూ చంద్రబాబు ఓపిగ్గా ఫొటోలు దిగారు. మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఏపీఎన్నార్టీ చైర్మన్ వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి తుపాను ముప్పు!

-మొదటిపేజీ తరువాయి

అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, ఆదివారం గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, పల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని తెలిపింది. సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, అనకాపల్లి, గుంటూరు తదితర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రకాశం జిల్లా పాకాలలో 152.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## త్వరలోనే ఫ్రీహోల్డ్‌కు స్వేచ్ఛ

-మొదటిపేజీ తరువాయి

తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం-1977లో చేసిన చట్టసవరణ, నిబంధనలకు లోబడి ఉన్న భూములకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరింది. అలాగే జిల్లా స్థాయి కమిటీలు ఇచ్చిన నివేదికల్లోని పలు అంశాలపై కూడా కీలక ప్రతిపాదనలు చేసింది. వాటన్నిటికీ ఉపసంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే ఫ్రీహోల్డ్ కింద కొన్ని రకాల భూములను అనుమతించకూడదని ఆ శాఖ చేసిన ప్రతిపాదనలపై వచ్చే సమావేశంలో చర్చించి అధికారికంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

**నాడు 13.59 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్**

అసైన్డ్ భూమి కేటాయించి 20 ఏళ్లు పూర్తయి, లబ్ధిదారుల చేతుల్లోనే భూమి ఉంటే వాటిని నిషేధ జాబితా 22ఏ నుంచి తొలగించాలని, ఆ తర్వాత రైతులకు ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పించాలని జగన్ ప్రభుత్వం 2023లో అసైన్డ్ చట్టాన్ని సవరించింది. ఈ విధానం అమలుకు 2023 డిసెంబరులో జీవో 596 తీసుకొచ్చింది. అయితే నాటి ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నేతలు కుమ్మక్కై.. 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే విచారణ చేయించింది. జగన్ సర్కారు 5.74 లక్షల ఎకరాలను అక్రమంగా, చట్టవిరుద్ధంగా నిషేధ బాబితా నుంచి తీసేసినట్లు తేలింది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని గత ఏడాది ఆగస్టులోనే ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై నిషేధం విధించింది. ఈ సమస్య తేలేవరకు నిషేధం పొడిగిస్తూ వస్తోంది.. సమస్య పరిష్కారానికి ఈ ఏడాది మార్చిలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. చర్చోపచర్చలు సాగినా అది కూడా సత్వర నిర్ణయం తీసుకోలేకపోయింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. వీలైనంత త్వరగా ఫ్రీహోల్డ్ భూములపై నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో గత రెండు సమావేశాల్లో ఉపసంఘం కీలక అంశాలపై చర్చలు జరిపింది. అసైన్డ్ చట్టం పరిధిలో ఉండి.. జీవో 596 మార్గదర్శకాల ప్రకారం అర్హత సాధించిన 7.85 లక్షల ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్‌కు అనుమతించాలని రెవెన్యూ శాఖ తాజాగా ప్రతిపాదించింది. భూమి లబ్ధిదారు చేతిలోనే ఉండి సాగు చేసుకుంటుంటే.. అలాంటి వాస్తవికమైన కేసుల్లో ఫ్రీహోల్డ్ జరిగేలా చూడాలని సూచించింది. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించారు. పోరంబోకు, షరతుగల పట్టాలున్న భూములు, చుక్కల భూములు, సర్వీస్ ఇనాం (దేవదాయ) భూములపై వచ్చే సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధ జాబితా నుంచి తొలగించిన 5.74 లక్షల ఎకరాల భూములను తిరిగి 22ఏలో చేర్చాలన్న ప్రతిపాదనను కూడా సబ్‌కమిటీ ఆమోదించింది. అలాగే పరిశ్రమలు, కంపెనీలు, సంస్థలు మొదలైనవాటికి ఇకపై లీజు ప్రాతిపదికనే కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని నిర్ణయించింది.

అధికారులపై మంత్రుల ఆగ్రహం

రాష్ట్రంలో వేల కోట్ల విలువైన వక్ఫ్ భూముల అన్యాక్రాంతంపై మంత్రివర్గ ఉపసంఘం ఆందోళన వ్యక్తం చేసింది. అత్యంత కీలకమైన ప్రాంతాల్లో ఉన్న ఖరీదైన భూములు దురాక్రమణకు గురవుతున్నాయని మం త్రులు అనగాని, పయ్యావుల సబ్‌కమిటీ భేటీలో ఆందోళన వ్యక్తం చేశారు.





## వైసీపీ విషవృక్షం కనుకే

# కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతుంది



- అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందజేత
- ప్రభుత్వం ద్వారా రూ.15 లక్షలు, యాజమాన్యం తరపున రూ.2.50 లక్షలు పరిహారం
- ఉద్యమకారుల మాదిరి దొంగ సింపతీ నటిస్తూ బాధిత కుటుంబాలను రెచ్చగొట్టడానికి వైసీపీ ప్రయత్నించింది
- తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం భయపడదు
- వైసీపీ ప్రభుత్వంలో రూ.5,10 లక్షల కంటే ఎక్కువ ఎక్స్ గ్రేషియా ఇచ్చిందే లేదు
- కార్మికులకు న్యాయం చేయడంలో ఎన్డీఏ కూటమి వెనుకాడదు
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్..

**బిక్కవోలు, అక్టోబర్ 24, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలిచి బీద, బలహీన వర్గాలకు న్యాయం చేస్తుందని, విషవృక్షం లాంటి వైకాపా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసి, ఉద్యమకారుల మాదిరిగా అతి చేసారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం శివారులో బాణాసంచా కర్మాగారంలో ఇటీవల కాలంలో సంభవించిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన 15 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కులను తూర్పుగోదావరి జిల్లా, బిక్కవోలు మండలం,కొమరిపాలెం గ్రామంలో గల సమావేశ మందిరంలో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా అందించారు. అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ లు పాల్గొని బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్కులను అందజేశారు. తొలుత కార్యక్రమాన్ని ఉద్దేశించి అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దురదృష్టవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదాన్ని రాజకీయం చేసేందుకు వైసిపి నాయకులు అనపర్తి నియోజకవర్గం నుండి సత్తి సూర్యనారాయణ రెడ్డి, మండపేట నియోజకవర్గం నుండి తోట త్రిమూర్తులు బహు ప్రయత్నాలు చేశారని అవన్నీ ప్రజలకు అర్థమయ్యాయి అని ఎద్దేవా చేశారు. ప్రమాదం జరిగిన రోజు ఘటనా స్థలానికి చేరుకున్న అనపర్తి మాజీ శాసనసభ్యులు ఒక వైద్యునిగా క్షతగాత్రులకు వైద్య నిమిత్తం సలహాలు, సూచనలు చేయక, రాజకీయాలు మాట్లాడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎక్స్ గ్రేషియా ద్వారా ప్రకటించిన 15 లక్షల రూపాయలతో పాటు, ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పి4 పథకం ద్వారా మృతుల కుటుంబాలకు మరింత లబ్ధి చేకూరేలా ప్రయత్నిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రమాద సంఘటనలో బాణాసంచా కర్మాగార యజమాని సత్తిబాబు మరణించినప్పటికీ వారి కుటుంబం మానవతా దృక్పథంతో ప్రతి బాధిత కుటుంబానికి రూ.2.5 లక్షలు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. అంతేకాకుండా ఘటన జరిగిన రోజు పుట్టెడు దుఃఖం లోనూ మరణించిన బాధితుల అంత్యక్రియల ఖర్చులకు గాను మృతునికి 60,000 చొప్పున అందించారని గుర్తు చేశారు. అనంతరం మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ తీవ్ర దుఃఖకరమైన సంఘటన జరిగినప్పటి నుండి ప్రభుత్వంపై తమ వంతు ప్రయత్నం గా స్థానిక శాసన సభ్యులు రామకృష్ణారెడ్డి తో కలిసి, ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం అందేలా ప్రయత్నాలు చేసామని ప్రభుత్వం స్పందించి ఎక్స్గ్రేషియా ప్రకటించడంతో పాటు, యాజమాన్యం వారు కూడా స్పందించి మృతుల కుటుంబాలకు 2.5 లక్షల రూపాయలు అందించడం వారి దాతృత్వానికి నిదర్శనమని కొనియాడారు. తదుపరి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వైసిపి అనేది ఒక విషవృక్షమని అందుకే ప్రజలు కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారని ఎద్దేవా చేస్తూ, ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా అందించదని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూ, ఉద్యమకారుల మాదిరి రాద్ధాంతం చేసే ప్రయత్నం చేశారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదు,పది లక్షల కంటే ఎక్కువ ఎక్స్గ్రేసియా ఇచ్చింది లేదని మండిపడ్డారు. వారి తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం భయపడదని అన్నారు. అవినీతికి తావు లేకుండా నిజ నిర్ధారణ కమిటీ ద్వారా విచారణ జరిపించామని, అనంతరం లేబర్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా అగ్నిప్రమాద బాధితులకు అందిస్తున్న ఎక్స్గ్రేషియా రూ.15 లక్షల రూపాయలతో పాటు యాజమాన్యం రూ. 2.50 లక్షలు అందించడం అభినందనీయమని, ఇలాంటి ప్రమాద పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. మృతులలో కొందరికి పార్టీ సభ్యత్వ నమోదు ఉన్నందున అదనంగా రూ. 5 లక్షల రూపాయలు అందుతాయని తెలిపారు. అనంతరం బాధితుల కుటుంబాలలో ఒరిస్సా కు చెందిన సత్యానంద్ కుంబర్ కుటుంబానికి మినహా మిగిలిన వారికి యాజమాన్యం తో కలిసి చెక్కులను అందించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సమర్పించిన తదుపరి సత్యానంద్ కుంబర్ కుటుంబానికి చెక్కును అందిస్తామని రెవిన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, రామచంద్రపురం ఆర్డిఓ అఖిల, టిడిపి యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి, జనసేన అనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త రాసేవాడు నాగు, బిక్కవోలు మండల పరిషత్ అధ్యక్షులు తేతల సుమ, అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తుక సూర్య కుమారి, సొసైటీ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి, బిక్కవోలు టిడిపి మండల అధ్యక్షులు పడాల వెంకటరామారెడ్డి, బిజెపి జనసేన మండల అధ్యక్షులు ఇందల వీరబాబు,మండల అధ్యక్షులు గుడిమెట్ల దుర్గారెడ్డి, బిక్కవోలు,రాయవరం మండల రెవెన్యూ, పోలీస్ సిబ్బంది బాధితుల కుటుంబ సభ్యులు, కూటమి కార్యకర్తలు, గ్రామ ప్రజలు , తదితరులు పాల్గొన్నారు.





ఒరిస్సాకు చెందిన సత్యానంద్ కుంబర్ కుటుంబంతో చర్చిస్తున్న రెవెన్యూ అధికారులు

# ఆలయ అభివృద్ధికి కమిటీ కృషి చెయ్యాలి..

భక్తుల ఆలోచనలకు తగ్గట్టుగా పని చెయ్యాలి - ఆలయాలకు సమర్ధ వంతమైన కమిటీలను వేయడం జరిగింది
స్వామి వారి ఆశీసులు అందరిపై ఉంటాయి - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
వేడుకగా శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నూతన కమిటీ అభినందన సత్కార సభ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని వివిధ దేవాలయాలు, ధార్మిక సంస్థలకు సమర్థవంతమైన కమిటీలను వేయడం జరిగిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్యాపురం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానానికి నూతన పాలక మండలి నియమించబడింది. మళ్ల వెంకట రాజు చైర్మన్‌గా, కోలా రామచంద్రరావు, పెండ్యాల ఉమా మహేష్, నక్కెళ్ల హరిప్రసాద్, వంజరపు శంకర్, సేలం సత్యనారాయణ, పానింగపల్లి సత్య శ్రీనివాస చార్యులు, తంగెళ్ల పద్మావతి, ఉప్పులూరి సూర్యకుమారి, కల్లూరి సూర్య నాగ వెంకట అన్నపూర్ణ, అరవ సువర్చల సంతోషి, కుప్పల రాజేశ్వరి డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారందరినీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులు గన్ని కృష్ణ, చల్లా శంకరరావు, కాశీ నవీన్ కుమార్, వై శ్రీను, జామి సత్యనారాయణ తదితరులు ఘనంగా సన్మానించారు. ఆలయం వద్ద టిడిపి నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు అధ్యక్షతన, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి ఉన్నంత ప్రాధాన్యత మన ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని ఉందన్నారు. ప్రస్తుతం నగరంలో కూటమి సభ్యులను కలుపుకొని ఎండోమెంట్ కమిటీలను సమర్థవంతమైన సభ్యులతో వేయడం జరుగుతుం దన్నారు. పార్టీ కోసం కష్టపడి కష్టాలను అధిగమించిన వారిని గుర్తించి అవకాశం ఇస్తున్నట్టు వివరించారు. కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 8 కమిటీలు ప్రమాణస్వీకారం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ అధినాయకత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు అధిక స్థాయిలో సేవింగ్స్ జరుగుతున్నాయన్నారు. గత వైకాపా మాదిరిగా కాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారులకు వెయ్యి రూపాయలు పెంచి ప్రతి నెల అందించడం జరుగుతుందన్నారు. సత్యనారాయణ స్వామి దేవస్థానానికి నూతనంగా నియమించబడిన కమిటీకి స్వామి వారి సేవ చేసుకునే భాగ్యం దక్కిందని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ పాలక మండలి సభ్యులుగా నియమితులైన ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన వారు వచ్చి వివాహ కార్యక్రమాలు జరిపించుకుంటారని తెలిపారు. భక్తుల ఆలోచనలకు తగ్గట్టుగా పని చేయాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,అధిక సంఖ్యలో మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## నేటి తరానికి ఆదర్శప్రాయుడు పంతం కొండలరావు

పంతంను సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన తడాల చక్రవర్తి, అను యాదవ్, పోసి కుమార్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సిసిసి ఎండి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పంతం కొండలరావు పుట్టినరోజు సందర్భంగా నగర కార్యాలయంలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెసిఎస్ ఇంచార్జ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తడాల విష్ణు చక్రవర్తి,ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ట్రేడ్ యూనియన్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు ముద్దాల తిరుపతిరావు (అను), వికలాంగుల సెల్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ముత్యాల పోసి కుమార్ తదితరులు సాలువాతో సత్కరించి కొండలరావుకి శుభాకాంక్షలు తెలియజేశారు. తడాల మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఆధ్యాత్మిక నిలయంగా రూపుదిద్దుకునేందుకు కొండలరావు ఎంతో కృషి చేశారని కార్తీక మాస కోటి దీపోత్సవం ఎంతో అద్భుతంగా నిర్వహిస్తున్న ఏకైక ఆధ్యాత్మికవేత్త అని అన్నారు.డైరెక్టర్ ముద్దాల అను మాట్లాడుతూ ఎందరో పేద విద్యార్థిని విద్యార్థుల ను చదివిస్తూ ఎండాకాలం లో మూగజీవాలకు మంచినీరు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న జంతు ప్రేమికులు కొండలరావు అని అన్నారు. ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ పలు స్వచ్ఛంద సేవ సంస్థలకు ఆదర్శవంతంగా ఉంటూ వాళ్ళ అభివృద్ధికి నిరంతరం కొండలరావు అన్న కృషి చేస్తున్నారని వారి సేవలు నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

## టీడీపీ కండువా కప్పుకున్న వైసిపి ఎంపీటీసీ శీలం భాస్కర్‌రావు




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం ఎంపిటిసి-2 శీలం భాస్కరరావు ఆ గ్రామ టీడీపీ నాయకులు నెక్కంటి రాంజీ, సర్పంచ్ సాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీ లో చేరారు. ఈ సంధర్భంగా భాస్కరరావుకు ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ కండువాను కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.

## ఎడిటర్ వాయిస్

# గురువు వెనుతిరుగుడంటే.. వ్యవస్థ పతనానికి సంకేతం!

ఒకప్పుడు విద్య అనేది ఆత్మీయత, విలువలు, గౌరవం అనే త్రివేణి స్రవంతిలా ప్రవహించింది. ఇప్పుడు అది గణాంకాలు, ఫలితాలు, రికార్డుల గజదొంగల వలలో చిక్కుకుంది.బోధనకు అంకితమై ఉన్న గురువు, క్రమంగా పరిపాలనా బంధనాల బానిసగా మారుతున్నాడు. ఇది వ్యక్తిగత వైఫల్యం కాదు.. విద్యా వ్యవస్థ పతనానికి సంకేతం. 'గురువు వెనుతిరుగుతుండు' అనే మాట మనకు ఒక హెచ్చరిక. దాన్ని వినగలిగితేనే మన భవిష్యత్తు నిలుస్తుంది. గురువుకు గౌరవం, స్వేచ్ఛ, భద్రత ఇవ్వగలిగితేనే విద్యార్థికి సృజనాత్మకత, జ్ఞానం, ఆనందం వస్తాయి.ఉపాధ్యాయుడికి బోధన వృత్తి పట్ల నిరాశ పెరగడం, విద్యార్థి–గురువు సంబంధం బలహీనపడడం దేశ భవిష్యత్తుకు ప్రమాదం. భారతదేశంలో గురువును 'ఆచార్య దేవోభవ' అని పూజిం చిన కాలం ఉంది. కానీ నేటి విద్యా వ్యవస్థలో గురువు ఒక అధి కార యంత్రంలో భాగంగా మారిపోయారు. ప్రైవేట్ పాఠశాలలలో 'ఫలితాలు' అన్న పదం గురువును గణాంకాల బందీగా మార్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో 'రికార్డు పనులు' గురువును బోధన నుంచి దూరం చేశాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు రోజంతా బోధనలో కంటే డేటా ఎంట్రీ, రిజిస్టర్ రాయడం, వివిధ పథకాల పర్యవేక్షణలో ఎక్కువ సమయం వెచ్చిస్తున్నాడు. పాఠశాలల్లో బోధనా స్వేచ్ఛ క్రమంగా తగ్గిపోతోంది. ప్రతి పాఠం 'మైక్రో ప్లాన్'లో బంధించబడింది. 'ఇంత సమయానికి ఇంత చదువు' అనే గణాంకం గురువుపై ఒత్తిడిగా మా రింది. ఒక మంచి సైన్స్ టీచర్ తన సృజనాత్మక పద్ధతులను వినియోగించాలంటే కూడా అనుమతి అవసరం అవుతోంది. పరీక్షల కేంద్రీకరణ, సిలబస్ భారం, మార్కుల ఆధారిత ఫలితాలు.. ఇవన్నీ బోధనను యాంత్రికంగా మార్చాయి. ప్రైవేట్ పాఠశాలలలో గురువులు 'రిపోర్టింగ్ యూనిట్స్ 'గా మారిపోయారు. విద్యార్థుల అభ్యాసం కంటే తల్లిదండ్రుల సంతృప్తి, ఫీజు వసూళ్లు, మార్కుల రేటింగ్‌లు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఒక ఉపాధ్యాయుడు ఒకే రోజులో ఐదు నుండి తొమ్మిది పీరియడ్స్ బోధించి, దాని తర్వాత 'పెర్ఫార్మెన్స్ రిపోర్ట్' సిద్ధం చేయాలి, తరువాత ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడాలి.. దీనికి విరామం లేదు. వారికి చెల్లించబడే వేతనం కూడా కనీస జీవన ప్రమాణాలకు సరిపోకపోవడం పరిస్థితిని మరింత దయనీయంగా చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక పాఠశాలలో ముగ్గురు గురువులు ఉంటే, విద్యార్థులు 150 మంది ఉంటారు. మరోవైపు ఏకోపాధ్యాయ పాఠశాలలు. వీటిలో తరగతుల బోధనతో పాటు మధ్యాహ్న భోజన పథకం, సర్కార్ ఆదేశాలు, వివిధ సర్వేలు, ఎన్నికల పనులు... ఇవన్నీ గురువుల భుజాలపై పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో బోధన నాణ్యతను కాపాడటం కష్టం. విద్యార్థులు ఆసక్తి కోల్పోతున్నారు, గురువులు ఉత్సాహం కోల్పోతున్నారు. అధిక పరిపాలనా ఒత్తిడి, తగిన గౌరవం లేకపోవడం, బోధన స్వేచ్ఛ కోల్పోవడం వంటి కారణాల వల్ల ఉపాధ్యాయులు మానసికంగా అలసిపోతున్నారని ఈ మధ్య పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు డిప్రెషన్, ఆందోళన, అసహనం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇది విద్యార్థుల అభ్యాస వాతావరణాన్ని కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. విద్య అంటే మార్కులు సంపాదించడం కాదు. మానవత్వం, విలువలను పెంపొందించటం. కానీ నేటి విధానం ఫలితాలను మాత్రమే కొలుస్తోంది. మనం విద్యను 'జీవితానికి తయారీ'గా చూడకుండా, 'పరీక్షకు తయారీ'గా మార్చేశాం. దీని ఫలితంగా సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచన, సమాజం పట్ల బాధ్యత అనే విలువలు తగ్గిపోతున్నాయి. గురువులకు స్వేచ్ఛ ఇవ్వాలి, బోధన పద్ధతులలో స్వతంత్రత ఉండాలి. ప్రతి గురువు తన సృజనాత్మకతను ప్రదర్శించగల వాతావరణం అవసరం. పరిపాలనా పనులు తగ్గించాలి,



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

## తెలంగాణకే తలమానికమైన

# ధర్మపురి నాటక సంస్థ

తెలంగాణలోనే మొదటిదిగా, తెలంగాణకే తలమానికంగా, ధర్మపురి పుణ్య క్షేత్రంలోని శ్రీలక్ష్మనరసింహ నాట్యమండలి గత 90 సంవత్సరాలుగా, కళామతల్లికి ఎనలేని సేవలందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సనాతన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు నిలయమైన ఈ క్షేత్రంలో, 1936లో ప్రారంభమైన నాటక సంస్థ 3 తరాల నటులతో పలు పౌరాణిక సాంఘిక చారిత్రక నాటకాలు–నాటికలు ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ప్రజాభిమానాన్ని చూర గొన్నది. గోదావరి తీరస్థ ప్రాచీన తీర్థము, పుణ్య క్షేత్రము అయిన ధర్మపురి పట్టణం, వేల సంవత్సరాల నుండి ఉజ్వల సాంస్కృతిక, వైదిక, నాగరికత, కలిగివున్న క్షేత్రంగా... ఆర్ష విద్యతో పాటు, సంగీతాది లలిత కళలకు నిలయంగా వాసికెక్కింది. తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం అంతగా లేక, స్తబ్దంగా ఉన్న రోజుల్లో, స్థానికుల సహకారంతో స్థాపించబడిన నాటక సంస్థ, తెలంగాణ లోనే మొదటిదిగా నిలువ కలిగింది. ఇది ప్రారంభం అయ్యే నాటికి తెలుగు భాషకు విలువ లేని "ఉర్దూ రాజభాష"గా గల నిజాం రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు... భారతీయ సంస్కృతికి, సాంప్రదాయాల కు, కళలకు విలువ ఇవ్వని కేంద్ర ఆంగ్ల ప్రభుత్వం మరో వైపు, అననుకూల వాతావరణం ఉండేది. అయినా స్థానికుల అభిమానం, ధనం, సేవాభావం, ఈ సంస్థకు ఊపిరి పోసా యి. కీర్తిశేషులు కాసర్ల వెంకట రాజయ్య శిక్షణలో, దర్శకత్వం లో, తొలి తరం నటులు "సతీ సావిత్రి" నాటక ప్రదర్శనతో ప్రారంభించి, అనంతర కాలంలో వెను తిరిగి చూడకుండా, సుమారు పాతిక పౌరాణిక నాటకాలు... ద్రౌపతి వస్త్రాపహ రణం, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాభారం, లవకుశ, భక్త రామదాసు, సతీ సక్కుబాయి, సతీ తులసి, శ్రీకృష్ణ రాయ బారం, పాండవోద్యోగం వంటి అనేక నాటకాలు ప్రదర్శిం చారు. ఆరోజుల్లో ఈ నటులు ప్రదర్శించని పౌరాణిక నాట కమే లేదంటే అతిశయోక్తి లేదేమో. కాకెరి లక్ష్మీ కాంత శాస్త్రి, రొట్టె చంద్రశేఖరశాస్త్రి, సంగనభట్ల మాణిక్య శాస్త్రి, తెలంగాణ త్యాగయ్య చాచం కృష్ణయ్య, జగన్నగారి విశ్వనాథశాస్త్రి లాంటి ఉద్దండులు, వారి సరసన దెమ్మ బాలకృష్ణయ్య స్త్రీ పాత్ర ధారిగా తొలి తరం నటులు బహు ప్రశంసా పాత్రులు అయినారు. నాటక సంస్థ రథసారథులలో ఒకరైన కే. వీ. కేశవులు ( రాష్ట్ర మాజీ మంత్రి), 1946 లో మంచిర్యాలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభలలో, శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శింప చేయగా, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, నార్ల వెంకటేశ్వ రరావు వంటి ప్రముఖులు నాటకాన్ని కాంచి, బహుథా ప్రశంసించారు. తర్వాత కాలంలో దేవులపల్లి రామానుజరావు, కాళోజీ నారాయణరావు, పివి నరసింహారావు, స్థానం నరసింహారావు లాంటి మేధావుల ప్రశంసా పాత్రమైంది. స్థానిక దైవం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో, ప్రత్యేక ఓపెన్ థియేటర్ లో ప్రదర్శిత నాటకాలకు జనం టిక్కెట్టు కొని మరీ చూసేవారు. ఆ రోజుల్లోనే సొంత నాటక ప్రదర్శన శాల ఉండేది. రకరకాల సీనరీ పరదాలు, మేకప్ సామగ్రి, గదలు, కిరీటాలు, ఉయ్యాలలు, నిచ్చెనలు, ఫైర్ వర్క్స్, వగయిరా సకల హంగులతో అట్టహాసంగా ఉండేది. మొదటి తెరపై భారతమాత చిత్రపటం కలిగి ఉన్న ఈ సంస్థ ఆ రోజుల్లో పెద్ద సాహసమే చేసింది. ఎందుకంటే ఇది రాజ




ద్రోహం కిందకు వచ్చేది. ఫైర్ వర్క్స్ లో యముని రాక, నారదుని మబ్బుల్లో ప్రయాణం, శిశుపాలుని శిరచ్ఛేదం, ప్రహ్లాదుని అగ్నిగుండంలో వేయడం, ద్రౌపదికి కృష్ణుడు చీరలు అందించడం, వంటి ఎన్నో అద్భుతాలను కశో జ్జల శివరామయ్య పర్యవేక్షణలో చూపారు. రెండవ తరం నటులు దశాబ్దకాలం ప్రదర్శన ఇవ్వగా, నాటి సీనియర్ నాయకులు దాద గారి కిషన్ రావు నిర్వహణలో, సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలకు ప్రారంభ నిధుల సేకరణ గావించారు. గయోపాఖ్యానం నాటకం తెలంగాణ లోని చాలా ప్రాంతాల్లో రొట్టె విశ్వనాథశాస్త్రి, గుండయ్య శాస్త్రి, పెండ్యాల శంకర్, ఓజ్జల రామచంద్రం, నరసింహా చారి, గుండి హనుమాన్లు, భోగం పురుషోత్తం వంటి మేటి నటులతో ప్రదర్శించారు. మూడవ తరంలో పౌరాణిక నాటకాలతో పాటు వీరపాండ్య కట్ట బొమ్మన, వీర కాపయ, నాగమ నాయకుడు లాంటి చారిత్రక నాటకాలు పెక్కు సాంఘిక నాటకాలు ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. 1984 లో జిల్లా కలెక్టర్ కె ఎస్ శర్మ, 1991 లో కలెక్టర్ బన్వర్ లాల్ ఆహ్వానం మేరకు, వారి సమక్షంలో కరీంనగర్ కళాభారతిలో ప్రదర్శనలిచ్చి బహుమతులు అందుకున్నారు. 1989 లో తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించిన, సాంప్రదాయ పద్య నాటక పోటీలలో సూర్యాపేటలో "కట్టబొమ్మన" ప్రదర్శించారు. 2016లో వరంగల్ లో, వేణుమాధవ్ ఆడిటోరియంలో... అనంతరం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో.. ప్రదర్శన ఇవ్వడం జరిగింది. నిధులు ప్రోగు చేసి సొంత సామగ్రిని సమకూర్చు కున్నారు. ప్రస్తుత నటులలో కొందరు వీడియో, చలన చిత్రాలలో అవకాశాలు పొందారు. విద్యావేత్త విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నరసయ్య, బహుముఖ ప్రజ్ఞాశాలి, నటులు కొరిడె నరహరిశర్మ, కాకెర్ల దత్తాత్రేయ, ఎస్ రామకృష్ణయ్య, మునిగాల కిషన్ తదితరులు చారిత్రక నటులుగా మిగుల గుర్తింపు పొందారు 1993 లో తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ పేర్వారం జగన్నాథం ద్వారా నిధులు పొంది, స్వర్ణోత్సవాలు జరిపి, గయోపాఖ్యానం నాటకం ప్రదర్శించి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ దర్శకులు దివంగత బి. ఎస్. నారాయణ చేత కళాకారులకు సన్మానాలు చేయించారు. సావనీర్ విడుదల చేశారు. 1955 లో ఈ సంస్థ కళాకారులకు ఆంధ్ర నాటక పరిషత్తు 1983 లో ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ కాకర లక్ష్మీకాంత శాస్త్రికి, పెండ్యాల సీతారాములకు ఘనంగా సత్కారం చేశాయి. స్థానిక డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య నాటక రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా గ్రామీణ కళా జ్యోతి అవార్డు లభించింది. నలుగురు వృద్ధ కళాకారులకు గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ పథకాలను మంజూరు చేసింది. ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా కళామతల్లికి సేవ చేస్తూ సాంప్రదాయక పద్య నాటకాలను బ్రతికిస్తున్న అపురూప అరుదైన నాట్యమండలి 2017 ఏప్రిల్ 2,3 తేదీలలో నాటి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి, నాటి ప్రభుత్వ చీఫ్ విప్, గత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీ. ఎస్.రాములు తదితర ప్రముఖులు హాజరు కాగా, 80 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రస్తుతం నరహరి శర్మ ఆధ్వర్యంలో, నర్సయ్య పర్యవేక్షణలో, దత్తాత్రి నిర్వహణలో, రామకిష్టయ్య, చంద్రమౌళి, వెంకట రమణ, కిశోర్, మహేందర్, సురేశ్, బాలకృష్ణ, శేఖర్, నర్సింహమూర్తి, జన్మంచి నరసయ్య, వంశీ కృష్ణ, నరహరి, అమర్, అనిల్, శ్రీనివాస్, రాజ గోపాల్, రాంకిషన్ లకు తోడు కాకెరి అరుణ, సంగనభట్ల ప్రతిభ తదితరులు స్త్రీ పాత్రలను పోషిస్తూ, పౌరాణిక చారిత్రక నాటకాల ప్రదర్శనలను కొన సాగిస్తున్నారు. అయితే ఇటు వృద్ధ కళాకారులకు చేయూత, అటు నాటక ప్రదర్శన లకు తగిన ప్రత్సాహం అందించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వం పై ఉంది.

# సర్పపూజకు ఉద్దిష్టమైనది నాగుల చవితి


కార్తీక శుక్ల పక్ష చవితిని "నాగుల చవితి" అని పిలుస్తారు. ఇది సర్పపూజకు ఉద్దిష్టమైన దినం. కార్తీక శుద్ధ చవితి నాడు నాగవ్రతం చేయాలని చతుర్వర్గ చింతామణి చెపుతున్నది. శ్రీనాధుని శివరాత్రి మహాత్మ్యంలో ఇలా వర్ణింప బడినది. "చలి ప్రవేశించు నాగుల చవితి నాడు, మెరయు వేసవి రథసప్తమీ దివసమున, అచ్చ సీతు ప్రవేశించి బెచ్చు పెరిగి, మార్గశిర పౌష మాసాల మధ్యవేళ". పై గీతాన్ని బట్టి నాగుల చవితి కార్తీక మాసంలో వస్తుందని అర్థమవు తున్నది. నాగు లు, గరుడులు, వానరులు, రాక్షసులు, అసురులు వీరంతా వేరువేరు జాతుల వారంటారు మానవ శాస్త్రజ్ఞులు. అస్సాం దక్షిణ భాగంలో ఉన్న నాగాయ్ కొండలలో ఇప్పటికీ నాగజాతి వారున్నారు. నాగులకు, ఆంధ్రులకు ప్రాచీన కాలమునుండి విశేష సంబంధముంది. భారతావనిలో అనేక ప్రదేశాలలో నాగజాతి వారున్నట్లు చరిత్ర చెపుతున్నది. కాశ్మీర రాజులు తాము కర్కోటక నాగ రాజు సంతతి వారమని చెప్పుకునే వారు. నాగపూరు రాజన్యులు తాము పుండరీక నాగరాజు సంతతికి చెందిన వారమని ప్రకటించు కునే వారు. ఆంధ్రులూ నాగజాతి వారనే వాదన కూడా లేకపోలేదు. బౌద్ధ ధర్మమంటే నాగులకు అనురక్తి ఉన్నట్లు, బుద్ధునికి పరమ భక్తులై నాగులు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారని బౌద్ధ వాఙ్మ యంలో అనేక గాథలు తెలుపు తున్నాయి. ఏలాపత్ర నాగుడు, ముచిలింద నాగుడు మొదలైన వారు బౌద్ధ గాథలలో ప్రసిద్ధులు. దిక్కులను పాలించే లోకపాలకులకు, నాగులకు సంబంధమున్నట్లు బౌద్ధుల విశ్వాసం. అమరావతి, నాగార్జున కొండతో పాటు అవిభక్త కరీంనగర్ జిల్లాలోని ప్రాచీనమైన ధూళికట్ట తదితర ప్రాంతాలలో బౌద్ధ శిల్పాలలో నాగరాజుల, నాగి మల చిత్రాలున్నాయి. ప్రాచీనాంధ్రులు నాగులను కటి ప్రదేశం నుండి పైభాగమంతా మనిషి రూపంలో, క్రింది భాగమంతా సర్ప రూపాలలో చెక్కారు. నాగరాజు చిత్రాలకు తలపైన ఐదు పడగలుంటాయి. నాగినికి ఒక్కటే పడగ. భారతావనిలో నాగపూజ ఆదినుండీ ఆచరణలో ఉంది. గౌతముడు తన గృహ్యా సూత్రాలలో పేర్కొనగా యజ్ఞ మంత్రాలలో నాగుల స్తుతి పేర్కొనబడింది. నాగశిలలు, నాగ కల్లులూ, ప్రతిమలు ప్రతి చోట దర్శన మిస్తాయి. పుట్టిన



బిడ్డలు చనిపోతుంటే సంతానం నిలవడానికి నాగ ప్రతిష్ఠలు చేయడం ఆరాధిం చడం ఆచారంగా ఉంది. పాములు భూమి అంతర్భాగమందు నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి " నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా "రైతు" కు పంటనష్టం కలగకుండా చేస్తాయి. అలా ప్రకృతి పరంగా అవి మనకు ఎంతో సహాయ పడుతూ ఉంటాయి. ఆదినుండీ ఆంధ్రులు, నాగారాధకులుగా ఉన్నారు. "నన్నేలు నాగన్న నాకులమునేలు, నాకన్న వారల, నాయింటి వారల, అప్తుల మిత్రుల, నందరను నేలు, పడగ దొక్కిన, పగ వాడనుకోకూ, నడుము దొక్కిన నావాడను కొనుమూ తోక తొక్కిన తొలగుచు పొమ్ము, ఇదిగో! నూక నిచ్చెదను మూకను నాకిమ్ము, పిల్లల మూకను నాకిమ్ము" అని నాగేశ్వరుని ప్రార్థించడం అనవాయితీగా ఉంది. ఐదు తలల పాములను వెండితో గాని, మట్టి తోనైనా చేసి పూజించడం ఆచారం. చెవిలో చీము పట్టినా, వినపడక పోయినా, చెవుల ను బంగారు, వెండితో చేయించి శివాలయాలకు సమర్పిం చడం పరిపాటిగా ఉంది. అనంత, వాసుకి, శేష, పద్మనాభ కంబల, కర్కోటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళి అని 12రకాల సర్పాలను ఒక్కొక్క నెలలో పూజించడం ప్రాచీన సాంప్రదాయంగా ఉండేది. ప్రపంచంలో శాస్త్రవేత్తలకు తెలిసిన దాదాపు అన్ని రకాల పాములున్న దేశం భారత దేశమే. మానవుని మానసిక శక్తికి హిందూదేశంలో పాము చిహ్నంగా ఉంది. మానసిక శక్తికి వేదాంత పరిభాషలో కుండలినీ శక్తి అని పేరు. నిస్సంగుల తపస్సు అంతా ఈ కుండలినీ శక్తిని లేపుటకే. కుండలినీ శక్తిని గ్రీకు భాషలో "స్పిరిమా" అంటారు. స్పిరిమా అంటే సర్ప వలయం. కుండలినిని సర్పంటైన్ గా పిలుస్తారు. శరీరమనే పుట్టకు తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటారు. మానవ శరీరంలో నాడులతో నిండివున్న వెన్నెముకను ' వెన్నుబాము' అని అంటారు. మూలాధారం నుండి సహస్రారము వరకు వెన్నెముక మధ్యనుండి సర్పాకారముగ కుండలినీ శక్తి అనబడు సుషుమ్నా నాడిని లేవ జూపడమే నాగపూజ ప్రధాన ఉద్దేశమని విజ్ఞుల భావన. కుండలినీ శక్తి మూలాధార చక్రంలో "పాము" ఆకారమువలెనే వుంటుందని "యోగశాస్త్రం" చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ... కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో ' సత్వగుణ' సంపత్తిని హరించి వేస్తూ ఉంటుందని అందుకు నాగుల చవితి రోజున ప్రత్యక్షంగా విష సర్పపుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది, అందరి హృదయాలలో నివసించే ' శ్రీమహావిష్ణువు నకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసే సత్కర్మనే నాగుపాము పుట్టలో పాలు పోయుటలోగల అంతర్యమని భావన.

### మందేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు

# విశేషంగా కృషి చెయ్యాలి : ఎమ్మెల్యే

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అత్యంత పురాతనమైన మందేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు కృషిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులచే ఎమ్మెల్యే బండారు ప్రమాణస్వీకారం చేయించారు. విజయనగరం మహారాజా వంశీకులు, పెద్దలు గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ గా ఉన్న ఈ ఆలయం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పేరుగాంచినదన్నారు. శ్రీ పార్వతీ సమేత మందేశ్వర స్వామి స్వామివారి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో వస్తుంటారు కనుక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా పాలకమండలి సభ్యులు కృషి చేయాలని సూచించారు. తమకు వచ్చిన అవకాశాన్ని భక్తిశ్రద్ధలతో ఆలయ అభివృద్ధికి వినియోగించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పాటుపడుతుందని వ్యాఖ్యానించారు. అనంతరం దేవాలయంలో నూతనంగా నిర్మించిన బాత్రూమ్స్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ కొత్తపేట బిజెపి ఇంచార్జ్ పాలూరి సత్యానందం మందపల్లి ఎంపీటీసీ సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ మాజీ దేవస్థానం ఛైర్మన్ చింతం విజయ కృష్ణ మోహన రావు మాజీ దేవస్థానం ఛైర్మన్ ధరణాల రామకృష్ణ కొత్తపేట పిఏసిఎస్ ఛైర్మన్ కంటంశెట్టి సత్య ప్రసాద్, పలివెల పిఏసిఎస్ ఛైర్మన్ తులా రాజు, మండల పార్టీ ప్రెసిడెంట్ జి. వీరేశ్ జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బొక్క ఆదినారాయణ, కనకేశ్వర రావు, బిజెపి నాయకులు, టిడిపి నాయకులు ముత్యాల బాబ్జీ,కంటంశెట్టి శ్రీనివాసరావు ఇతర గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొనియున్నారు. నూతన ధర్మకర్తల మండలి సభ్యులుగా గంధం సత్య వెంకట నాగాజీ, దంగేటి సాయి నాగ భూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి, దేవపాటి వేంకటేశ్వర రావు, కొత్తపల్లి నాగ శిరోమణి, తణుకు వీరభద్ర రావు, కముజు స్వప్న. అయలూరి శ్రీరామ్మూర్తి, అర్చక మరియు ఎక్స్ అఫిషియో మెంబరు ప్రమాణ స్వీకారం చేసియున్నారు. ఈ కార్యక్రమం దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఏ.సి.) సమక్షంలో భారీగా జరిగింది.

### వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న

## రాష్ట్ర ఎస్సీ కమీషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం రాష్ట్ర ఎస్సీ కమీషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్ దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధం రావు, ఆత్రేయపురం ఎమ్ఆర్ఓ రాజేశ్వరావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## కొత్తపేట డివిజన్ పరిధిలో ఆక్వా సాగు సమీక్ష సమావేశం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రెవిన్యూ డివిజనల్ కార్యాలయం, కొత్తపేట నందు శ్రీ పి.శ్రీకర్, రెవిన్యూ డివిజనల్ అధికారి, కొత్తపేట వారి ఆద్వర్యంలో యల్.బి.యస్.వర్ధన్, మత్య శాఖ సహాయ సంచాలకులు, రాజోలు మరియు కొత్తపేట డివిజన్ పరిధిలోని మత్య శాఖాధికారులతో సమీక్ష సమావేశం జరిగినది ఈ సమావేశంలో కొత్తపేట డివిజన్ పరిధిలో ఆక్వా సాగు మొత్తం య.1420.02 సెంట్లు ఉండగా, ఇప్పటివరకు య 563.19 సెంట్లు ఆక్వా సాగు చేసుకొనుటకు రిజిస్ట్రేషన్ చేసుకునియున్నారు. ఇంకనూ మిగిలిన య 856.83 సెంట్లు ఆక్వా సాగు కొరకు రిజిస్ట్రేషన్ పొందవలసియున్నది. కావున మిగిలిన ఆక్వా రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ (లైసెన్స్) చేసుకుని ప్రభుత్వ పధకాలైన రాయితీ పై విధ్యుత్, ఇన్సూరెన్స్, బ్యాంకుల నుండి ఋణ సదుపాయము, చెరువు నిర్వహణలో (లాస్ట్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), వివిధ పరికరముల కనుగోలు పై రాయితీలను మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత పదకములను పొందగలరని, రిజిస్ట్రేషన్ చేసుకొనని యెడల పైన తెలిపిన పదకముల పై రాయితీలకు అనర్హులు కాగలరని రెవిన్యూ డివిజనల్ అధికారి తెలియజేయడమైనది.

## అండర్-14,-17 పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మండల స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీలలో ఆదిత్య పాఠశాల అమలాపురం కామన గురువు విద్యార్థులు అండర్ -17, 14 విభాగాల్లో అద్భుత ప్రదర్శన చూపి, విజయకేతనం ఎగరవేశారు. అండర్ 17 విభాగంలో ఎన్. బాల మణికంఠ సాయి (10 వతరగతి) 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, షాట్ పట్ లో రెండో స్థానం కైవసం చేసుకోగా,కె.దిలీప్ కుమార్ (10 తరగతి) 200 మీటర్ల పరుగు పందెం లో 3వ స్థానం, పి. ధనకృష్ణ వినయ్ (9వ తరగతి )ట్రిపుల్ జంప్ లో రెండవ స్థానం, యోగా లోఎన్.దిలీప్ కుమార్ (8వ తరగతి) 4 స్థానం, జి. విశ్వనాథరాజు (9వ తరగతి) షాట్ పట్ లో 4 వ స్థానం కైవసం చేసుకుని, కోకో ఆటలో పి.బి.కార్తికేయ (9వ తరగతి) కె. దీపేష్ (9వ తరగతి)లు గెలుపొంది డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ -14 బాలుర విభాగం షార్ట్ పట్ లో కె. హర్షవర్ధన్ ( 9వ తరగతి) మొదటి స్థానం, ఎం.యశ్వంత్ (9వ తరగతి) 2 వ స్థానం, లాంగ్ జంప్ లో బి.వి.ఎన్ కళ్యాణ్ (9వ తరగతి) మొదటి స్థానం, కె. లోకేష్ (8వ తరగతి) 3వ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో జి. అభినవ రెడ్డి (8 వ తరగతి) మొదటి స్థానం, కోకో ఆటలో ఎం. హనూజ్ సాయి రుద్రాక్ష్ (8వ తరగతి), డి దీవెనరాజ్ (9వ తరగతి)లు, యోగా లో జి. తనీష్ నాయుడు (7 వ తరగతి), ఎం. జశ్వంత్ బాబు ( 7 వ తరగతి)లు, కబడ్డీలో కె. హర్షవర్ధన్ (9 వ తరగతి), డి.షణ్ముఖ్ (9 వ తరగతి) ఆర్. భార్గవ్ (9వ తరగతి)లు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అంతే కాకుండా కబడ్డీ టీమ్ మండల స్థాయి రన్నరఫ్ గా నిలిచారు. అండర్ -14 బాలికల విభాగం యోగాలో టి .కార్తీక సూర్య (8వ తరగతి)3వ స్థానం, పి. ప్రసన్న లక్ష్మీదేవి (8 వ తరగతి) 4 వ స్థానం, ఎం.జెస్సికా లక్ష్మి (8 వతరగతి) 6 వ స్థానం, టి. మోహిత (8 తరగతి) 7వ స్థానం, బి. వరలక్ష్మి లు(8వ తరగతి) 8 వ స్థానం సాధించి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చదువులోనే కాకుండా ఆటల పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి,డైరెక్టర్ శృతి రెడ్డి, ఆదిత్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ చలపతిరావు, పాఠశాల ప్రిన్సిపల్ రామప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ జి.సుధ లు గెలుపొందిన విద్యార్థులను ప్రశంసించి, అందుకు తగిన శిక్షణ ఇచ్చిన పి.ఈ.టి లు కె. విజయకృష్ణ, జి.వెంకట శివ, ఎ. భవానిలను అభినందించారు.

### గెయిల్ సహజవాయు పైపులైన్

## లీకేజీ, భద్రతపై అవగాహన



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రాజమహేంద్రవరం గెయిల్ ఇండియా సంస్థ వారి ఆధ్వర్యంలో సహజ వాయువు పైపులైను లీకేజీ, భద్రత మీద శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాకారుల బృందం గొర్రెల కృష్ణమూర్తి, గొర్రెల రాము,ద్వారా గెయిల్ ఇండియా ద్వారా వచ్చే పైపులైన్ లీకేజీ వలన ప్రమాదాలు జరిగినప్పుడు గ్యాస్ లీకేజీ వంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలు ఎటువంటి భయానికి గురి అవ్వకుండా వెంటనే గెయిల్ ఇండియా టోల్ ఫ్రీ నెంబర్‌కు గాని, మీ పక్కనే ఉన్న గెయిల్ ప్లాంట్ దగ్గరికి గాని, వెళ్లి సమాచారం అందించాలనీ అన్నారు.అలాగే గెయిల్ పైప్ లైన్ దగ్గరలో ఇల్లు నిర్మించుకోకూడదు అని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రొక్కల విజయలక్ష్మి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బి.ఆదిశంకరం, గ్రామ ప్రజలు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

### వకుళమాత అన్నదాన భవనాన్ని

## పరిశీలించిన ఎమ్మెల్యే బండారు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం పరిశీలించారు. పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున దాత శ్రీరామరాజు రూ.1.50 కోట్లను అన్నదాన భవనంలో కిచెన్ నిర్మాణం, స్టీమింగ్ బాయిలర్లు ఏర్పాటుకు విరాళంగా అందజేశారు, ఆనంద్ గ్రూప్ ఛైర్మన్ కాశీ విశ్వనాథరాజు వాటర్ ప్లాంట్, బయోగ్యాస్ ఏర్పాటుకు విరాళం అందజేశారు. దాతలు ముందుగా స్వామివారిని దర్శనం చేసుకుని అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తో కలిసి అన్నదాన భవనంలో కిచెన్, స్టీమింగ్ బాయిలర్లు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరావు పాల్గొన్నారు.

## రావులపాలెంలో అయ్యప్ప స్వామి పడిపూజ




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం గ్రామంలో కేశిరెడ్డి నరసింహారావు ఇంటి వద్ద పీ.వీ.వెంకటరెడ్డి స్వామి ఆధ్వర్యంలో అంబటి మణికంఠ స్వామి. రాజు స్వామి పర్యవేక్షణలో అయ్యప్ప పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా 100కు పైగా అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి వేద పండితులు పెడసనగంటి సీతారామ శాస్త్రి. వెలగలకాశి విశ్వేశ్వర రెడ్డి. సత్తితులసి వెంకట రెడ్డి, కూనా సూర్యప్రకాష్, సతీష్, వీరబాబు, వెంకన్న బాబు, బురయ్య, గోపాలకృష్ణ, ఆదినారాయణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంవత్సరంలో కేసిరెడ్డి నరసింహరావు స్వామి (నాని స్వామి) శివమాల, వెంకటేశ్వర స్వామి మాల, భవాని మాల, అయ్యప్ప మాల, వేసుకొని ఆధ్యాత్మికతలో భక్తులకు ఆదర్శంగా నిలిచిన ఈ స్వామిని స్వాములందరూ ప్రసంశించినారు. గురుస్వామి ఆశీర్వదించారు.

### మద్యం వినియోగదారులు

## సురక్ష యాప్‌ని వినియోగించుకోవాలి

### ఈ యాప్ ద్వారా ఎవరైనా మద్యం క్వాలిటీ చెక్ చేసుకోవచ్చు... : క్షేత్రస్థాయి పర్యటనలో ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** కల్తీ మద్యం అంశంలో జగన్ పాపాలు శాపాలై ప్రజల్ని పట్టి పీడించాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం రింగ్ రోడ్డులో శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో ఎక్సైజ్ సూపెరడెంట్ ప్రసాద్,కొత్తపేట ఎక్సైజ్ సి.ఐ కాత్యాయని తదితరులతో కలసి మద్యం షాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకువచ్చిన సురక్షా యాప్‌పై వినియోగదారులకు అవగాహన కలిగించారు.మద్యం షాపు వద్ద కొనుగోలు చేసిన బాటిల్ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ బాటిల్ ఎక్కడ తయారు అయ్యింది, అందులో ఉన్న వివరాలు తెలుస్తాయన్నారు. స్వయంగా ఎమ్మెల్యే బాటిల్స్ ను స్కాన్ చేసి వివరాలను అందరికీ చూపించారు. ప్రతి వినియోగదారుడు ఈ విధంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కూటమి హయాంలో నాణ్యమైన మద్యం లభిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి వీరేష్, కొవ్వూరి అచ్చిరెడ్డి మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్త యర్రంశెట్టికి పుట్టినరోజు వేడుకలు



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ మండలం జనిపెల్ల యావరం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తకు విష్ణు శ్రీ రెస్టారెంట్ అదినేత నల్లా విష్ణు చేతుల మీదుగా కేక్ కటింగ్ చేసి తన దగ్గర పని చేస్తున్న యర్రంశెట్టి సతీష్‌కు తన సహృదయంతో మొదట కేక్ కట్ట చేయించి ఆకేకు తనకు తిని పించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు దానితో మంత్రముద్దు డైన సతీష్ తన యజమానికి తిరిగి కేక్ తినిపించి క్రుతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విష్ణు శ్రీ రెస్టారెంట్‌కి చెందిన కార్మికులు పొల్గని అందరూ సతీష్ కీ కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నల్లా విష్ణువుతో పాటు నాగబాబు, చిట్నిడి రాజు, బోసు సాయి, కదలి ప్రసాద్, మున్నా చెరుకూరి, నాని, తూము ఏసుబాబు, నార్ని సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## రావులపాలెం అక్షయ సేవా సంస్థ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలం చెముడు లంక గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీమ్ హైదరాబాదులో ఈవెంట్ అసిస్టెంట్గా పనిచేస్తారు ఈయనకి కార్ యాక్సిడెంట్ జరగడం వలన కాలర్ బోన్ వెన్నుపూస ఫ్యాక్చర్ అయింది ఆపరేషన్ జరిగింది ఈయనకి సైడ్ ఎఫెక్ట్స్ రావడం వలన తలలోను ఒళ్లంతా కనుతులు రావడం జరిగింది ఇబ్రహీమ్ కి వైద్యం చేయించుకునే స్తోమత లేక అక్షయ సేవా సంస్థను సహాయం కోరగా సంస్థ నుంచి 10000 రూపాయలు మిరియాల సుబ్బరాజు 1000. కే పావని 1000. దూలం విజయ్ 500. కొల్లూరి వెంకటలక్ష్మి 500. కామగల్ల మల్లేశం 500. సాయి 500. నల్లమిల్లి వెంకట రెడ్డి 500. మొత్తం 14,500. రూపాయలు చెముడు లంక గ్రామం వెళ్లి అక్షయ సేవా సంస్థ సభ్యులు చేతుల మీదుగా ఇబ్రహీమ్‌కి ఇవ్వడం జరిగింది దీనికి సహకరించిన సభ్యులకి సభ్యులు ఫ్రెండ్స్ కి ధన్యవాదములు.

## వరి కోతలు వాయిదా వేసుకోండి...

### రైతులకు వ్యవసాయ అధికారుల సూచన....




**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వాతావరణ మార్పులు అధిక వర్షపాతం నమోదు అవుతున్న నేపద్యంలో రైతులు వరి కోతలు వారం రోజుల పాటు వాయిదా వేసుకోవాలనీ మండపేట మండల వ్యవసాయ శాఖ అధికారి కే.ప్రభాకర్ సూచించారు. మండపేట మండలం ఏడిద గ్రామంలో క్షేత్రస్థాయిలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నేలకు ఒరిగిన పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా రైతులకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.వాతావరణం శాఖ హెచ్చరికల మేరకు వరి కోతకి వచ్చిన పంట పొలాలను పంట కోతలు వాయిదా వేసుకోవాల్సిందిగా కోరారు.పడిపోయిన పంట పొలాల నుండి వర్షపు నీటిని బోదేలు ఏర్పాటు చేసుకుని మురుగునీటి కాలువలోకి మళ్లించాలని చెప్పారు.మొలక రాకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణమును పిచికారి చేయాలన్నారు. పాలు పోసుకునే దశలో వరి ఉన్నట్లయితే ఈ దశలో నీట మునిగితే రెండు మూడు రోజులలో గింజ రంగు మారే ప్రమాదం ఉంటుందన్నారు. బరువు కూడా తగ్గుతుందన్నారు. నీటిని పూర్తిగా తీసివేసి కార్బన్డిజం 2గ్రాములు లేదా ప్రొఫెనోకోనజల్ 1 మిల్లీలీటర్ లీటర్ నీటికి కలిపి బాగా తడిచే విధంగా పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గొడవర్తి సత్యనారాయణ, గ్రామ టిడిపి నాయకులు పర్వతనేని వీర్రాజు, మేక జేజి బాబు రైతులు, గ్రామ వ్యవస్థ సహాయకులు పాల్గొన్నారు.

### పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో
# పర్యటించిన ఏవో జోకా అమృత
### 'మంతా' తుఫాన్ నేపథ్యంలో రైతులకు ఏవో పలు సూచనలు



ప్రత్తిపాడు, విశ్వం వాయస్ న్యూస్ : ఇటీవల కురిసిన వర్షాలకు ప్రత్తిపాడు మండలంలో ప్రస్తుతానికి ఎటువంటి పంట నష్టం జరగలేదని ప్రత్తిపాడు వ్యవసాయశాఖా అధికారిణి జోకా అమృత ఒక ప్రకటనలో తెలియచేసారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మార్వో సూర్య ప్రభ, ఆర్ఐ గోపాలకృష్ణ, వ్యవసాయ సిబ్బందితో కలిసి పొలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటన వివరాలు సేకరించారు. 'మంతా' తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో ఉన్న రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని,అలాగే రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఏవో జోకా అమృత ఆదేశించారు.అలాగే పంట పొలాల్లో వర్షాకాలంలో తీసికోవలసిన జాగ్రత్తలను తన సిబ్బంది ద్వారా రైతులకు తెలియజేయాలని ఏవో జోకా అమృత సూచించారు.

### ఘనంగా అయ్యప్ప స్వామి
# 34వ లక్ష బిల్వార్చన పూజ
### అధిక సంఖ్యలో పాల్గొన్న స్వాములు



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో 34 వ లక్ష బిల్వార్చన, పడిపూజ కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక, స్థానికేతర అయ్యప్ప మాలధారులు సాయంత్రం నాలుగు గంటల నుండి వివిధ రకాల పుష్పాలతో, రంగులతో, బుడగలతో అయ్యప్పస్వామి పీఠాన్ని అలంకరించారు. మాలధారులు తాము కూడా స్వీయ అలంకరణ చేసుకుని గ్రామ వీధుల్లో అయ్యప్ప గీతాలను ఆలాపిస్తూ పేటతుళ్ళు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఏడు గంటలకు గ్రామ పెద్దలు, ప్రజలు, అయ్యప్ప స్వాముల సహాయ, సహకారాలతో కాకినాడ వాస్తవ్యుడైన గురుస్వామి రవిశర్మ నిర్వాహకత్వంలో ప్రత్యేకంగా అలంకరించిన అయ్యప్ప స్వామి పీఠం వద్ద గొల్లప్రోలు వాస్తవ్యులు సిద్ధ నానాజీ గురుస్వామి పూజలను నిర్వహించారు. అయ్యప్ప మాల దీక్షాపరులు పెనుపోతుల వీరబాబు, పెనుపోతుల శ్రీను పేరున లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తుం లోవరాజు, పడాల శ్రీహరి స్వాములతో పడిపూజను నిర్వహించారు. అనంతరం మాల దీక్షాపరులకు, పూజా కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు పలహారం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు పర్వత సుభాష్, పర్వత చంటిబాబు, బైరా రామారావు, కందా శివ, అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు మరోతు వెంకటరమణ, పడాల శ్రీను, కొత్తుం శ్రీను, కొల్లుబోయిన భగవాన్, బొల్లు రాజా, సకిరెడ్డి ప్రభాకర్, ఎమ్.వి.ఆర్. చౌదరి, ముత్తుం శ్రీను, అధిక సంఖ్యలో మాల దీక్షాదారులు, గ్రామ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# కోటి దీపోత్సవంలో పాల్గొని పునీతులు కండి..
### తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ



ప్రత్తిపాడు, విశ్వం వాయస్ న్యూస్ : ప్రత్తిపాడులో డిసిసిబి బ్యాంకుకి వెనక ఉన్న ఖాళీ స్థలంలో గురు భవాని పత్రి రమణ ఆధ్వర్యంలో తల పెట్టిన కోటి దీపోత్సవం, సహస్ర లింగార్చన కార్యక్రమాల్లో హిందూ బంధువులు హాజరై జయప్రదం చేయాలని ప్రముఖ పురోహితులు తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ మీడియాతో అన్నారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవం కమిటీతో ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం సుబ్రహ్మణ్య శర్మ మీడియాతో మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసంలో 2వ సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 1000 రూపాయలు టిక్కెట్ పొందిన దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించి శంభో శంకరుడికి ఇష్టమైన పలు రకాల ద్రవ్యాలతో అభిషేకించి సాయంత్రం 5 గంటలకు కోటి దీపోత్సవం కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న అయ్యప్ప స్వాములకు,గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిలకమర్తి వీరభద్రం, గురుభవాని గానాల గంగాధర్, మార్లపూడి అప్పలరాజు, కంఠస్ఫూర్తి బుజ్జి, అంబటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజా దర్బార్



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : సమస్య మీది... పరిష్కారం మాది అనే నినాదంతో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోంది. శుక్రవారం నిర్వహించిన 26వ ప్రజా దర్బార్ కార్యక్రమానికి వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలో గల రాజ్యసభ సభ్యుల కార్యాలయంలో జరిగిన ఈ ప్రజా దర్బార్‌లో అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా చర్యలు చేపట్టినట్లు కార్యాలయ ఇన్‌ఛార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పడి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రజలలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ప్రజాదర్బార్‌పై నమ్మకం పెరుగుతుందని, వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ప్రజలు తరలివచ్చిన తీరు దానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నూటన్ ఆనంద్, చింతపల్లి అర్జున్, డీఆర్‌యుసిసి సభ్యులు ముత్యాల అనిల్, జున్నూరు బాబి, ఐటిడిపి పాలిక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రత్నగిరిపై టెన్సైల్ మెంబ్రేన్ షెడ్ ప్రారంభించిన ఎమ్మెల్యే



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో భక్తుల విశ్రాంతి సౌకర్యార్థం సుమారు రూ. 2.50 కోట్లతో నూతనంగా నిర్మించిన టెన్సైల్ మెంబ్రేన్ షెడ్ (అధిక నాణ్యత గల ఫాబ్రిక్ లేదా ప్లాస్టిక్ పొరతో తయారు చేసిన)ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శుక్రవారం ప్రారంభించారు. లారస్ ల్యాబ్స్ సంస్థ విరాళంగా అందించిన నిధులతో ఈ ఆధునిక సదుపాయాన్ని ఆలయ పడమట రాజ గోపురం వద్ద నిర్మించిన ఈ విశ్రాంతి షెడ్‌లో భక్తుల సౌకర్యం కోసం దర్శన టికెట్ కౌంటర్లు, వ్రత బుకింగ్ కౌంటర్లు, ప్రసాద విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని భక్తుల సేవకు ఎమ్మెల్యే అందుబాటులో తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా నిత్యాన్నదాన శాలను సందర్శించి అక్కడ భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదం నాణ్యతను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు స్వయంగా తాను కొద్ది సేపు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఆహార నాణ్యతపై భక్త అన్నార్తులతో మాట్లాడారు. భోజనం రుచి, పరిశుభ్రత, సేవ పట్ల భక్తులు సంతృప్తిని వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యాలపై మరింత దృష్టి పెట్టాలని దేవస్థానం సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. అనంతరం దేవస్థానంలోనే స్థానిక పసుపులేటి చక్రి ఏర్పాటు చేసుకున్న పండ్ల రసాల అమ్మకం దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, లారస్ ల్యాబ్స్ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో
# సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ : నియోజకవర్గం మండల కేంద్రమైన ప్రతిపాడులోని ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధిలో భాగంగా రూ.14.98 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపనతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగులు నాని, మాజీ ఎంపీటీసీ వీరబాబు, జిబిఆర్ రియల్ ఎస్టేట్ అధినేత గొడే హరీష్, నాయకులు పత్రి రమణ, మదినే దొరబాబు, శెట్టిబత్తుల నానిబాబు, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### స్కూల్ పిల్లలకు పోలీస్ వ్యవస్థపై
# అవగాహన సదస్సు : సీఐ దారం సురేష్



మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : పోలీస్ అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకొని మండపేట పట్టణ పోలీస్ స్టేషన్లో శుక్రవారం స్కూలు పిల్లలకు పోలీస్ సిబ్బంది నిర్వహించే విధివిధానాల పట్ల అవగాహనా సదస్సును పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ దారం సురేష్ వివరించారు. అమరులైన పోలీస్ వారిని స్మరించుకుంటూ విధినిర్వహణలో వారి కర్తవ్య భాధ్యతలను తెలియపర్చే ఈ కార్యక్రమంలో విద్యార్ధిని విద్యార్థులకు రక్షక భటుల విధి విధానాలు, పౌరులకోసం సిబ్బంది చేపడుతున్న చర్యలను, మహిళల కోసం తర్ఫీదు పొందిన మహిళా పోలీసులుతో మహిళల రక్షణ కోసం మరియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఉండే సంరక్షణ ఆయుధాలను శిక్షణపొందిన సిబ్బందితో ఏ పరిస్థితుల్లో ఉపయోగిస్తారో తెలియపరచడమే కాకుండా ప్రజలు సమాజంలో చట్టానికి లోబడి జీవనం సాగించడానికి కార్యాలయంలో సిబ్బంది ఏ విధంగా గూఢచారి వ్యవస్థను నడుపుతుంది అనే అంశాలతో పాటు ప్రజల నుండి వచ్చిన పిర్యాదులను స్టేషన్లో ఏ విధంగా పరిష్కరిస్తారు, నేరం చేసిన వారిని అదుపులో తీసుకుని వారిని జైలులో ఉంచే ప్రదేశాల గురించి వారి ప్రవర్తనలో మార్పు కోసం ఏ విధంగా కౌన్సిలింగ్ ఇస్తామో విద్యార్థులకు విపులంగా వివరించామని సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఈ అవగాహన సదస్సులో సబ్ ఇన్స్పెక్టర్ బి.రాము, మహిళా కానిస్టేబుల్స్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### కోనసీమ తిరుపతి వెంకన్నకు
# నిత్యాన్నప్రసాద వితరణ విరాళం



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కోనసీమ తిరుపతి 7 వారాల వెంకన్నకు అన్న ప్రసాదం విరాళంగా సఖినేటిపల్లి మండలం, అంతర్వేది వాస్తవ్యులు బెల్లంకొండ నాగ మల్లేశ్వరరావు, భానుకళ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116/- రూపాయలు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి విరాళంగా సమర్పించినారు అని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధరరావు తెలియజేశారు.

# ప్రజా ఉద్యమం పేరుతో ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ రూరల్ రమణయ్య పేట వైద్య నగర్‌లోని వైయస్సార్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28 వ తేదీన జరగబోవు వైఎస్సార్ సీపీ ప్రజా ఉద్యమం పేరుతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ర్యాలీ పోస్టర్ ను ఆవిష్కరించిన మన వై.ఎస్.అర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రివర్యులు, కాకినాడ రూరల్ మాజీ శాసనసభ్యులు కురసాల కన్నబాబు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### కాకినాడ రూరల్‌లో
# ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు!
### ఎమ్మెల్యే నానాజీ కృషిని కొనియాడిన అడబాల రత్న ప్రసాద్



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామానికి రక్షిత మంచినీరు అందించాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా చేస్తున్న కృషికి అనుగుణంగానే, కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ అదే లక్ష్యంతో పనిచేస్తున్నారని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలలో ప్రతి కుటుంబానికి కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించడం ద్వారా ఆరోగ్య భద్రత కల్పించే విధంగా మంచినీటి పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆ దిశగానే గ్రామపంచాయతీలకు ఏ నిధులు లభ్యమైనా వాటిని మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి, పైపులైన్ల ఏర్పాటుకు కేటాయిస్తున్నారని, రానున్న ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలలో రోడ్లు, డ్రైన్లను నిర్మించాలనే ఉద్దేశంతో ఇతరత్రా వచ్చిన నిధులను ప్రస్తుతానికి రక్షిత మంచినీటి పథకాలకే కేటాయిస్తున్నారని ఆయన వివరించారు. ఒకవైపు రైతాంగానికి పంట కాలువలు, మురుగు నీరు పారుదలకు కాలువలు తవ్వించారని, మరోవైపు గ్రామాలలో రక్షిత మంచినీటి పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, ఎమ్మెల్యే నానాజీ తన ఎన్నికల హామీని చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నారని అడబాల రత్న ప్రసాద్ ఈ సందర్భంగా కొనియాడారు.

### అనూ యాదవ్ అక్రమ అరెస్టుపై

# మాజీ ఎంపీ భరత్ మండిపాటు

**3వ పట్టణ పోలీసు స్టేషన్ వద్ద బైఠాయింపు - వైసీపీ శ్రేణుల ఆందోళన, త్రీటౌన్ వద్ద ఉద్రిక్తత**
**అనూ యాదవ్‌కు 41 నోటీసు ఇచ్చి పంపించిన పోలీసులు**
**బీసీ మహిళను రెండు గంటలపాటు పోలీసు స్టేషన్లో కూర్చోబెడతారా.. ?**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఫ్లెక్సీపై పేడ రాశారనే అభియోగంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అను యాదవ్ పై కేసు నమోదు చేసి త్రీటౌన్ పోలీసు స్టేషన్ కు తీసుకురావడంతో మాజీ ఎంపీ, వైసీపీ నగర అధ్యక్షుడు,రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం ఆమె ఇంటికి వెళ్ళిన పోలీసులు అనూ యాదవ్‌ను స్టేషన్‌కు తీసుకు వచ్చి రెండుగంటలు కూర్చోబెట్టారు. విషయం తెలిసి అక్కడకు చేరుకున్న వైసీపీ శ్రేణులు భరత్ ఆధ్వర్యంలో ఆందోళన చేయడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు దిగివచ్చి ఆమెకు 41 సీఆర్పీ నోటీసులు ఇచ్చి బయటకు పంపించారు. వైసీపీ శ్రేణులు ఇంటికి వెళ్ళిపోతుండగా పోలీసు స్టేషన్ గేటు వద్ద. అడ్డుకున్న సీఐ అప్పారావు మళ్లీ స్టేషన్ లోకి రావాలని కోరడంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపట్ల. త్రీ టౌన్ ఎస్ఐ అప్పలరాజు దురుసుగా ప్రవర్తించడంతో మాజీ ఎంపీ మార్గాని భరత్ మండిపడ్డారు. దీంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. దురుసుగా ప్రవర్తించిన ఎస్.ఐపై. చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా మార్గాని భరత్ మీడియాతో మాట్లాడుతూ మహిళలపై వరుసగా జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా ఫ్లెక్సీలోని రాజమండ్రిలో ఈవీఎం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖంపై కోపంతో ఎవరైనా పేడ రాసి ఉండొచ్చు. అంత మాత్రంచేత బీసీ వర్గానికి చెందిన మహిళా నాయకురాలు అనూ యాదవ్ ను అరెస్టు చేసి ఎలా తీసుకు వస్తారని ప్రశ్నించారు. తుని, రాజమండ్రి ప్రభుత్వ వసతి గృహంలో జరిగిన సంఘటనలపై మహిళలు ప్రశ్నిస్తే ఈవీఎం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కేసు పెట్టిస్తారా అని ఆయన నిలదీశారు. అసలు బాలికల వసతి గృహం వద్ద ఈవీఎం ఎమ్మెల్యే ఫ్లెక్సీ ఎందుకు,దానికి పర్మిషన్ ఉందా అని ఆయన ప్రశ్నించారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద తన పేరుతో ఉన్న శిలాఫలకాన్ని ఆదిరెడ్డి వాసు అనుచరులు గునపాలతో బద్దలు కొట్టినప్పుడు తాను ఫిర్యాదు చేసినా ఎవరి మీద చర్యలు తీసుకోలేదని,ఇప్పుడు మాత్రం పేడ రాశారని ఏకంగా పదిమంది పోలీసులు అనూ యాదవ్ ఉంటున్న అపార్టమెంట్‌కు వెళ్ళి అరెస్టు చేయడమేమిటని భరత్ నిలదీశారు. ఇది ఆమె గౌరవానికి భంగం కలిగించడమేనని మండిపడ్డారు. ఎమ్మెల్యే మనిషి మద్యం సిండికేట్ కు సంబంధించి మాట్లాడిన ఆడియో బయటపెడితే ఎలాంటి చర్యలు తీసుకోని పోలీసులు మహిళను రెండు గంటలు స్టేషన్‌లో కూర్చోబెట్టారని ఆయన విమర్శించారు. వారిపై కోర్టులో కేసు వేస్తామని హెచ్చరించారు. అప్పటికీ ఇప్పటికీ పాలన ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారని మార్గాని భరత్ వ్యాఖ్యానించారు. అనూ యాదవ్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఫ్లెక్సీపై పేడ రాసినట్లు సీసీ ఫుటేజీ ఉందని పోలీసులు చెబుతున్నారని, మరి నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు ఆడియో ను తమ నాయకుడు మార్గాని భరత్ బయటపెడితే పోలీసులు చర్య తీసుకోలేదని విమర్శించారు. ఇలాంటి కేసులకు తాను భయపడేది లేదన్నారు. న్యాయవాది శంభూ ప్రసాద్ మాట్లాడుతూ 41 నోటీసులు ఇచ్చి పంపాల్సిన ఈ కేసులో పోలీసులు అతిగా స్పందించి అనూ యాదవ్ ను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకు వచ్చారని,దీనిపై న్యాయపరంగా పోరాటం చేస్తామని చెప్పారు.

# అక్టోబర్ 26న ఛలో కోరుకొండ, బహిరంగ సభ నిర్వహిస్తాం..

**దళితులపై దాడులకు నిరసనగా.. ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని.. - కూటమి ప్రభుత్వం పరిపాలన చెత్తగా ఉంది**
**సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫ్లాప్ - గూగుల్ డేటా సెంటర్ వల్ల వచ్చే ఉద్యోగాలు 200 మాత్రమే**
**డేటా సెంటర్ ఏర్పాటు వల్ల పర్యావరణానికి పెను ప్రమాదం - మాజీ ఎంపీ హర్షకుమార్ విమర్శ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు బస్ ప్రమాదంలో 19 మంది మృతి చెందడం బాధాకరమని మాజీ ఎంపీ హర్షకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ డిగ్రీ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ హైటెక్ బస్సుల్లో భద్రతపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. హైటెక్ బస్సులలో నాలుగైదు ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. నవంబర్ 30వ తేదీ రాత్రి రాజమండ్రి రూరల్ గాడాల బాధితుడిని చెట్టుకు కట్టి కొట్టిన కేసులో నలుగురు నిందితులను మాత్రమే అరెస్టు చేసి, మరో ఐదుగురిని ఇంకా అరెస్టు చేయడం లేదని స్పష్టం చేశారు. కందుకూరులో కాపు వ్యక్తి లక్ష్మీనాయుడుని హత్య చేస్తే ప్రభుత్వం షాక్ అయిపోయిందని హడావడిగా బాధిత కుటుంబానికి పెద్ద ఎత్తున పరిహారం ఇచ్చిందని తెలిపారు. రాజమండ్రి, గాడాలలో దళిత యువకుడు పాముల శ్రీనుపై దాడి చేస్తే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వానికి దళితులు ఎలా కనిపిస్తున్నారని నిలదీశారు. గాడాల లో దళిత యువకుడిపై దాడికి నిరసనగా ఈనెల 26వ తేదీ ఆదివారం ఛలో కోరుకొండ, బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఏదైనా సంఘటన జరిగితే భారీగా నష్టపరిహారం ఇవ్వడం చంద్రబాబుకు అలవాటు అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు జరుగుతున్న తగిన న్యాయం జరగడం లేదని వివరించారు. ఇప్పటి వరకూ పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య జరిగిన వెంటనే రాష్ట్రం వల్లే పాస్టర్లకు ఏడు నెలలు చెల్లించాల్సిన గౌరవ వేతనాలను వెంటనే చెల్లించారని తెలిపారు. రాష్ట్రంలోని పూజారులకు, మౌజానులకు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతదేహానికి చేసిన పోస్ట్ మార్టం రిపోర్ట్ రిలీజ్ చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పరిపాలన చెత్తగా ఉందని ఎద్దేవా చేశారు. 13 రోజులుగా ఆరోగ్య శ్రీ ఆగిపోయి ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారని గుండెపోటు వచ్చినప్పటికీ వైద్యం అందని పరిస్థితిలో రాష్ట్రంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వానికి హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం 15 నెలల కాలంలో లక్ష కోట్లు అప్పు తీసుకొచ్చారని 6 వేల కోట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రభుత్వం నిర్వహించలేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన బినామీలకు మెడికల్ కాలేజీలు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. ఓటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రజలను బాధలు పెడుతున్నారని పేర్కొన్నారు. 20 ఆర్టీసీ బస్సులకు 5 మాత్రమే తిరుగుతున్నాయని తెలిపారు. 19 సంవత్సరాల నిండిన మహిళలకు రూ 15 వేలు ఇస్తానన్న పథకం అమలు కావడం లేదని అన్నారు. అలాగే రైతు భరోసా, తల్లికి వందనం వంటి పథకాలు అమలు కావడం లేదని అన్నారు. సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తానన్న పథకం కూడా అమలు కావడం లేదని వివరించారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడం సంతోషమని రాజీవ్ గాంధీ పాలనలో టెక్నాలజీకి బాటలు వేశారని వివరించారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు ఉపయోగం లేదని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు డెన్మార్క్, ఐర్లాండ్, రుగ్వే , స్పెయిన్ తదితర దేశాలు అనుమతించలేదని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వల్ల పర్యావరణానికి చెప్పిన ముప్పు ఉందని, ఒక పట్టణానికి కావలసిన కరెంటు 1,క్యూబిక్ మీటర్ల నీరు ఈ ప్లాంట్ చల్లార్చడానికి వినియోగించవలసి ఉంటుందని అన్నారు. నిన్నటి వరకు జగన్ గూగుల్ డేటా సెంటర్ ను వ్యతిరేకించారని ఇప్పుడు జగన్ సడెన్ గా ప్లేట్ ఫిరాయించారని విమర్శించారు. డేటా సెంటర్ ఆదానీకి పవర్ కాంట్రాక్ట్ ఇవ్వడం వల్లే చంద్రబాబు, జగన్ విశాఖ డేటా సెంటర్ కు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. గూగుల్ డేటా సెంటర్ కు విద్యుత్ సరఫరాను ఏపీ ట్రాన్స్‌కో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కమ్యూనికేషన్ వ్యవస్థను భారతీ ఎయిర్ టెల్ కాకుండా బీఎస్ఎన్ఎల్‌కు ఇవ్వాలి కదా అని అన్నారు. ప్రైవేట్ సంస్థలకు కాంట్రాక్టు ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ఏమి లాభం అని ప్రశ్నించారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు ఇస్తున్న భూములు ఏపీ ప్రజలవని అన్నారు. డేటా సెంటర్ వల్ల వచ్చే ఉద్యోగాలు 200తో పాటు 5 వేలు సెక్యూరిటీ ఉద్యోగాలు మాత్రమే వస్తాయని తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి : పవన్ కుమార్



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుకొండ భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం కోరుకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్బిఐ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన విభూతి రఘురాం, విభూతి శివశంకర్ సైబర్ మోసాలు పై కళాజాత కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్లు ఫోన్ స్కాంలో, డిజిటల్ అరెస్టులు,స్వల్పకాలంలో కోటీశ్వరులు ఎలా అవుతారు, ఆన్లైన్ ఉద్యోగాలు, లాటరీ, ఇప్పుడు కొత్తగా వాట్సప్ కి వచ్చే ఏపీకే ఫైల్స్ కోసం అలాగే బ్లూ కలర్ లో ఉండే లింకులను డౌన్లోడ్ చేసుకోవద్దని తెలియజేయడం జరిగింది. ప్రజలు సైబన్ నేరాలకు గురైతే, సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేయడం ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పవన్ కుమార్,మెసెంజర్ విజయలక్ష్మి, గ్రామస్తులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## రఘుదేవపురంలో ఉపాధి హామీ గ్రామ సభలు




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామ పంచాయతీలో ఎంపీడీవో ఎం. భారతి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభ నిర్వహించడం జరిగినది. గ్రామ సభలో 25 పంట కాలువలు, చెరువులు రెండు 2, పారం పాండులు 2, కంపోస్ట్ పిట్లు 20, గోకులాలు 5 గుర్తించడం జరిగింది. అదే విధంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఈ కేవైసీ వెరిఫికేషన్ కచ్చితంగా చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచి ఇందుగుమెల్లి చంద్ర లీల,సెక్రటరీ బరుకుల రత్నం, టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి, ఫీల్డ్ అసిస్టెంట్ నారే సుబ్బారావు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు కాండ్రు శ్రీనివాస్, గెద్దాడ త్రిమూర్తులు, బొమ్మిరెడ్డి సూరిబాబు, పిండి రాధాకృష్ణ, వార్డు నెంబర్, మేట్లు,ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

## నరసన్న సన్నిధిలో బత్తుల ఘనంగా కార్తీక దీపోత్సవం

### అన్న సమారాధనకు లక్ష రూపాయలు విరాళం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కార్తీక మాసం పురస్కరించుకొని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కార్తీకమాస దీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీకదీపం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వేద పండితులు వెంకటలక్ష్మికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. నరసన్న సన్నిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న వితరణ కార్యక్రమానికి బత్తుల వెంకటలక్ష్మి లక్ష రూపాయలు విరాళాన్ని నరసన్న సేవ కమిటీసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు, వీర మహిళలు, తెలుగుదేశం, బిజెపి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 9న కాపునాడు కార్తీక వన సమారాధన

### ఆహ్వాన పత్రిక ఆవిష్కరించిన కార్యవర్గం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీచౌక్ కాపునాడు కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజమండ్రి పార్లమెంటు కాపునాడు ప్రధాన కార్యదర్శిగా దేశినీడి రాంబాబు, రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కాపునాడు అధ్యక్షుడిగా పిల్లా దుర్గా ప్రసాద్ లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ నియామక పత్రాలతో పాటు నవంబర్ 9 వ తేదీన జరిగే కాపునాడు కార్తీక వన సమారాధన ఆహ్వాన పత్రికను కార్యవర్గం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు అధ్యక్షుడు గుదే రఘు నరేష్ మాట్లాడుతూ గడచిన కొన్ని సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా సామాజిక వర్గీయులు అందరూ ఒకచోట కలిసేలా వన సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. గత నెలలో జరిగిన ఉభయ గోదావరి జిల్లాల కార్యవర్గ సమావేశం విజయవంతం చేసినందుకు కమిటీకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి వీరబాబు, రుద్ర దుర్గాప్రసాద్, కాళ్ల చక్రరావు, బొమ్మల సత్యనారాయణ, ర్యాలీ రామకృష్ణ, సింహాద్రి ప్రసాద్, రావిపాటి మణికంఠ, దేనేడి మణికంఠ మణికంఠ, ఇంటి జయరాజ్, కోరుమిల్లి నాయుడు, బచ్చు నాగార్జున, కుంపట్ల రామకృష్ణ, మీసాల గణేష్, సింహాద్రి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### వైద్యాధికారిణి శైలజా రాణి ఆధ్వర్యంలో

## పోలియో వ్యతిరేక దినోత్సవం




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్సీ వైద్యాధికారిణి కె.శైలజ రాణి ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో వ్యతిరేక దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శైలిజారాణి మాట్లాడుతూ పోలియో వ్యాధి వల్ల చిన్న పిల్లల్లో అంగవైకల్యం కలుగుతుందని ఇది రాకుండా ఉండడం కోసం పుట్టిన ప్రతి బిడ్డకు విధిగా పోలియో వ్యాక్సిన్ వేయించాలని తద్వారా ఈ వ్యాధి రాకుండా అరికట్టవచ్చని అన్నారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య సిబ్బంది అందరూ నిండు జీవితానికి రెండు చుక్కలనే నినాదంతో ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ రఘునాథ్, ఎంపీ వాచ్ఈఓ వై.ఎస్ రాయుడు, పిహెచ్ ఎంకె.ఆదిలక్ష్మి, స్టాఫ్ నర్స్ నాగమణి, ఎల్‌టి హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఎం ఎల్ హెచ్ పి అరుణ, ఏఎన్ఎంలు ఆర్ జ్యోతి, పద్మ, కుమారి,కృష్ణవేణి,శాంతి, రమణమ్మ, ఆసుపత్రి ఓ పి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## దారా వారి పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో ఘనంగా జరిగిన వార్త పేపర్ రిపోర్టర్ దారా జీవన్ బాబు కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతానగరం మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నందు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా చెరుకూరి సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా కొల్లి రాజు, ట్రెజరర్‌గా ఆరాధ్యులసాయి, సలహాదారునిగా సనమండ్ర లాజరు, గౌరవ అధ్యక్షునిగా నల్లి పెదబాబు, సంయుక్త కార్యదర్శిగా ఆరవపల్లి సురేష్, కార్య నిర్వహణ సభ్యులుగా దారా జీవన్ బాబు,పసలపూడి రత్నరాజు, తాతపూడి బెంజిమెన్, బందిల దుర్గాప్రసాద్, మెరుపో రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను పలువురు పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సూరిబాబు కేక్ ను కట్ చేసి మీడియా ప్రతినిధులకు తినిపించారు.

పేద ప్రజలకు వైద్యులు

# శిరికి ప్రకాశరావు సేవలు మరువలేము..

చైర్మన్ లంక సత్యనారాయణ

ఘనంగా డాక్టర్ శిరికి ప్రకాశరావు 31వ వర్ధంతి..

200 మంది మహిళలకు చీరలు పంపిణీ



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక 14వ డివిజన్‌లో వైద్య సేవలందించిన మారుతీ క్లినిక్ అధినేత డాక్టర్ సిరికి ప్రకాశరావు 31వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులతో పాటు పలువురు వైద్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు భార్య రవణమ్మ, కుమారుడు డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అక్షయ సొసైటీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ లంక సత్యనారాయణ, రమేష్ చెస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. డాక్టర్ ప్రకాష్ రావు చేసిన సేవలను కొనియాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండి 24 గంటలు వైద్యం అందించే వారని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు వారి కుమారుడు అజయ్‌కుమార్ కూడా అదే బాటలో పయనిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ సందీప్, డాక్టర్ శాంతి, శిరికి అక్కునాయుడు, దత్తి సుజాత, అల్లు కనకరత్నం, హేమలత,ధనేష్, శేషుబాబు, సాయిరామ్, ఈతలపాటి రవి, రాజ్‌కుమార్, ప్రతాప్, నాగేశ్వరరావు, లక్ష్మి, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై భారీ ర్యాలీ





రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : సభ్య సమాజం సిగ్గుపడేలా అతి దుర్మార్గంగా మహిళల పైన చిన్న పిల్లల పైన జరుగుతున్న అత్యాచారాలను వ్యతిరేకిస్తూ ఇటీవల తునిలో 13ఏళ్ల బాలికపై జరిగిన అమానుష సంఘటనను నిరసిస్తూ రాజమహేంద్రవరం నగరంలో సమాజ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసు అధికారులు సిబ్బంది తీవ్రంగా స్పందించారు. సమాజంలో ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించే రీతిలో ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన 300 మంది విద్యార్థులతో రాజమండ్రి నగర వీధులలో ఫ్లెక్సీ బోర్డులు పట్టుకొని" మహిళలపై" అత్యాచారం అమానుషం" "మహిళలను గౌరవిద్దాం" చిన్న పిల్లల రక్షించుకుందాం" అంటూ నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు ఆదిత్య డిగ్రీ కళాశాల వద్ద కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ ఫణికుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ఇన్స్పెక్టర్ మంగాదేవి అమీనా బేగం శక్తి టీం సభ్యులు ఆదిత్య కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు, పోలు కొండ సాయి, డాక్టర్ బి.హెచ్ రమాదేవి పాల్గొన్నారు.

# గణనీయమైన వృద్ధిని సాధిస్తున్న సెమీకండక్టర్ పరిశ్రమ



రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జిజియు)లోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం "ఆధునిక సిఎం ఓస్ సాంకేతికతలో బాండ్ గ్యాప్ రిఫరెన్స్ యొక్క క్రమబద్ధమైన రూపకల్పన" అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యుకేలోని అనలాగ్ డివైసెస్ సంస్థ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ రాజశేఖర్ నాగులపల్లి ప్రధాన వక్తగా (కీ రిసోర్స్ పర్సన్) హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా సెమీకండక్టర్ పరిశ్రమ విశ్వవ్యాప్తంగా వేగంగా వృద్ధి చెందుతోందని, అలాగే ప్రభుత్వాలు కూడా తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి. వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిజియు పరిశోధన & అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎస్. రాజు, డీన్ డాక్టర్ బి.ప్రభాకరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ రాజశేఖర్‌ను విశ్వవిద్యాలయ అధికారులు ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అంతకుముందు ఆయన వైస్ చాన్సలర్ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీబీ రాజులను కలసి పలు విద్యా మరియు పరిశోధన సంబంధిత అంశాలపై చర్చించారు.

# విద్యార్థులకు రైన్ కోట్లు అందజేత






ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ : మండలం పరిధిలో చింతలూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, మండల విద్యాశాఖ అధికారి బి.అప్పాజీ చేతుల మీదుగా రైన్ కోట్లు అందచేశారు. చింతలూరు పాఠశాల విద్యార్థులు చేసే బోధన కృత్యాలు, సామాజిక సందేశ వీడియోలను సోషల్ మీడియాలో తిలకించిన మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వాసంశెట్టి శేషు కుమార్ విద్యార్థులు పాఠశాలకు వచ్చే సమయంలో వర్షం వలన ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో రైన్ కోట్లును సమకూర్చారు. అలాగే చింతలూరు గ్రామ టిడిపి అధ్యక్షులు వైట్ల గంగరాజు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమగు మిక్సీని బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రైన్ కోట్లు, మిక్సీని బహుకరించిన దాతలను ఎంపీడీవో అభినందించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు పాఠశాలకు వివిధ సదుపాయాలు కల్పనలో కూడా చొరవ చూపిస్తున్నందుకు పాఠశాల ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దుర్గాదేవి, గ్రామ టిడిపి సీనియర్ నాయకులు వైట్ల శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం

# పాలకమండలి ప్రమాణ స్వీకారం..







రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక ఆర్యాపురంలో వేంచేసియున్న ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం ఉదయం 11.23 గంటలకు ఆత్మీయులు, కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జరిగింది. ఆలయ ఇనస్పెక్టర్ రామలింగేశ్వర రావు పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. పాలక మండలి ప్రమాణ స్వీకారం అనంతరం డైరెక్టర్లు అందరూ చైర్మన్‌గా మళ్ల వెంకటరాజును ఎన్నుకున్నారు. చైర్మన్ మళ్ళ వెంకట్రాజు, డైరెక్టర్లుగా కోలా రామచంద్ర రావు, పెండ్యాల ఉమా మహేష్, నక్కెళ్ళ హరిప్రసాద్, వంజరపు శంకర్, సేలం సత్య నారాయణ, పాణింగిపల్లి సత్య శ్రీనివాసచార్యులు, తంగేళ్ల పద్మావతి, ఉప్పులూరి సూర్యకుమారి, కల్లూరి సూర్య నాగ వెంకట అన్నపూర్ణ, అరవ సువర్చల సంతోషి, కుప్పల రామేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాజమండ్రి సిటీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు, తెలుగు యువత నాయకులు నక్కా దేవి వరప్రసాద్ తదితరులు హాజరై పాలకమండలికి శుభాకాంక్షలు తెలియజేశారు. పాలకమండలి సభ్యులుగా నియమితులైన ప్రతి ఒక్కరు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సత్యనారాయణ స్వామి దేవస్థానం అంటే ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి చాలామంది వివాహ కార్యక్రమాలు జరిపించుకుంటారని తెలిపారు. దానికి తగినట్టుగా ఏర్పాట్లు కల్పించే విషయంలో పాలకమండలి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మర్రి దుర్గా శ్రీనివాస్, నాయకులు జక్కంపూడి అర్జున్, ఉప్పులూరి జానకి రామయ్య, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, సింహాద్రి సతీష్, వానపల్లి శ్రీనివాస్, జి.కొండబాబు, అప్పలరాజు, కెవి శ్రీనివాస్, బీజేపీ నాయకులు కాలెపు సత్య సాయిరాం, తంగెళ్ల శ్రీనివాస్,గార్లపాటి సూర్యనారాయణ, పులి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు







చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ : చింతూరు మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థులకు పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర, సమాజంలో మహిళలపై జరిగే అఘయిత్యాల నుండి తమను తాము ఎలా కాపాడుకోవాలో, లైంగిక వేధింపుల నుండి రక్షణ అనే అంశం పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు ఎస్ ఐ రమేష్ మాట్లాడుతూ.. పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవం యొక్క విశిష్టత తెలియజేసారు. పోలీసుల త్యాగాలను స్మరించుకొని విధి నిర్వహణలో, దేశ అంతర్గత భద్రతను కాపాడటంలో తమ ప్రాణాలను అర్పించిన వేలాది మంది అమర పోలీసుల త్యాగాలను గుర్తుచేశారు. శాంతి భద్రతలు పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని. ప్రజలు ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాడానికి అవసరమైన శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటామని అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100/112 ద్వారా ఎటువంటి ఆపద వచ్చినా తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టి నిశ్వర్థ సేవలను అందించడానికి సిద్ధంగా ఉంటామని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థినులు పాల్గొనడం జరిగింది.

# రాయవరం బాణాసంచా మృతుల కుటుంబాలకు పరిహారం..

- అందజేసిన మంత్రి సుభాష్, కలెక్టర్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ళ

ప్రతి ఒక్కరిని సహాయంతో ఆదుకుంటున్నాం.. - కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నెరవేర్చింది..



రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ఇటీవల రాయవరం గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి నేడు కొమరిపాలెంలో 15 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందజేసిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు,జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్,పిఠాపురం అండ్ అనపర్తి జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీగణపతి ఫైర్ వర్క్స్ యాజమాన్యం నుండి కూడా మృతి చెందిన తొమ్మిది మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి 2 లక్షల 50 వేలు చొప్పున పరిహారం, టిడిపి సభ్యత్వం కలిగి ఉన్న 8 మంది మృతుల కుటుంబాలకు త్వరలో పార్టీ నుండి తలో 5లక్షలు అందజేయనున్నట్లు మంత్రి సుభాష్ ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పది రోజుల క్రితం ఇక్కడ జరిగిన బాణాసంచా ప్రమాదంలో పదిమంది మృతి చెందడం దాంతో బాధిత కుటుంబాలను ఆదుకోవాలంటూ స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించడం ఆ కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని వారిని తప్పనిసరిగా ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉందని కోరడం జరిగింది. మరొకపక్క ఈ విషయంపై వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేయడం జరిగింది. ప్రభుత్వం కమిటీ వేసి ఆ ప్రచారంలో నిజం లేదని తేల్చడం జరిగింది. వైసీపీ వాళ్లు బాధితుల కుటుంబాలు దగ్గరకు వెళ్లి మీకు ప్రభుత్వం నుండి సహాయం ఏది రాదని చెప్పి దొంగ ధర్నాలు చేయడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఈరోజు ప్రభుత్వం నుండి ఒక్కో కుటుంబానికి 15 లక్షల రూపాయలు చొప్పున అందజేయడమే కాకుండా వీరిలో ఎనిమిది మందికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుండి కూడా వారికి ఐదేసి లక్షల రూపాయలు చొప్పున త్వరలో అందజేయడం జరుగుతుంది. ఈ జిల్లాలో ఎప్పుడూ లేనంతగా ఈ కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాంకేతికంగా ఇది రాయవరంలో జరిగినప్పటికీ మొత్తం ప్రమాద సంఘటన అంతా అనపర్తి నియోజకవర్గానికి సంబంధించినదే. అయినప్పటికీ ఎమ్మెల్యే జోగేశ్వరరావు పెద్ద ఎత్తున సహకారం అందించడం, మంత్రి వాసంశెట్టి సుభాష్, హోం మంత్రి అనిత , కలెక్టర్ మిగతా అధికారులందరూ సహాయక చర్యల నుండి పరిహారం వచ్చేవరకు కృషి చేయడం జరిగింది. ముఖ్యమంత్రి నివేదికలు వచ్చిన వెంటనే ఒక్కో కుటుంబానికి 15 లక్షల రూపాయలు చొప్పున ప్రకటించడం జరిగింది. ఈరోజు ఆ పరిహారం ఆ పది కుటుంబాలకు అందజేయడం జరిగింది అలాగే ఈ ప్రమాదంలో యజమాని వెలుగుబంటి సత్తిబాబు కూడా మృతి చెందడం జరిగింది. అయినప్పటికీ వారి కుటుంబం కూడా సహృదయంతో స్పందించి ఒక్కో కుటుంబానికి రెండు లక్షల 50 వేల రూపాయలు చొప్పున ఈ రోజున అందజేయడం జరిగింది. ఈ దురదృష్టకర సంఘటనలో భాధితులకు న్యాయం చేయడం అందరూ తమ వంతు సహకారం అందజేశారు. కార్మిక శాఖ నుండి ఈ పరిహారం ఇవ్వడం జరిగింది. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అలాగే ఇక్కడ మృతి చెందిన వారి కుటుంబాలకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన వారున్నారు. కూటమి ప్రభుత్వం పి 4 ద్వారా వారిని ఆదుకునే కృషి చేస్తుంది.

# ఎదుగుదలను జీర్ణించుకోలేక బురదజల్లే కుటీల ప్రయత్నాలు

## కుల సమావేశాలను వక్రీకరిస్తున్న వక్రనేతలు గుబ్బల మూర్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధన నిర్వహణపై అమలాపురంలో జరిగిన సమావేశంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ కొంతమంది ప్రబుద్ధులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. పార్టీలకతీతంగా జరిగిన కుల సమావేశంలో కుల ప్రస్తావన గురించి మాట్లాడేటప్పుడు కులానికి సంబంధించిన విషయాలు అనేకం వస్తాయి.మనవాళ్లే కదా అని కలిసిమెలిసే ఆలోచనతో రాజకీయాలకతీతంగా మనసు విప్పి మాట్లాడుకుంటారు. దానిని కూడా రాజకీయానికి ముడివేసి ఒక వ్యక్తిని టార్గెట్ చేస్తూ కించపరిచే విధంగా వక్రీకరిస్తున్నారంటే సమాజంలో ఇటువంటి మనుషులు మన మధ్య ఉండటం మన దౌర్భాగ్యం అని చెప్పుకోవాలి.గత కొన్ని సంవత్సరాలుగా వాసంశెట్టి సుభాష్ నేతృత్వంలో భారీ ఎత్తున శెట్టిబలిజ కార్తిక మాస వన సమారాధన నిర్వహిస్తున్నారు. 50,000 ల మంది శెట్టిబలిజ కులస్తులతో మొదలైన ఈ వన సమారాధన లక్షల మంది శెట్టిబలిజ కులస్తులు కుటుంబ సమేతంగా హాజరవుతున్నారు. ఇది చాలా పెద్ద విషయం ఒక కులానికి సంబంధించి అంత మందితో కుల సమీకరణ చేయడం చిన్న విషయం కాదు.చిన్న పెద్ద తారతమ్యం లేకుండా హెచ్చుతగ్గులు బేధం కలగకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ సమావేశం నిర్వహించాలి. మరోపక్క ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కోవాలి. వీటన్నిటికీ సిద్ధపడి వాసంశెట్టి సుభాష్ ఈ కార్యక్రమాన్ని తన భుజస్కాంతాలపై వేసుకొని గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు.ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించాలని ఆలోచనతో ముందుగా కుల పెద్దలతో అమలాపురంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని నియోజకవర్గాల నుండి పార్టీలు కతీతంగా పెద్దలు పాల్గొన్నారు. వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ తను కులంలో పుట్టినందుకు గర్వపడుతున్నానని నాకు ఈ కులం రాజకీయ ప్రస్థానానికి మూలాధారం అయిందనీ.నా ఎదుగుదల లో కూడా కులం ఒక అండగా నిలిచిందని ఈ కులానికి చెందిన వాడిగా నన్ను గుర్తించి కూటమి ప్రభుత్వం మంత్రిని చేసిందని గర్వంగా తెలియజేశారు. అలాగే కూటమి పార్టీ నేతృత్వంలో అన్ని కులాల మద్దతిస్తేనే విజయం సాధించానని అనేక సందర్భాలలో అనేక చోట్ల బహిరంగంగానే తెలియపరిచారు.అదేవిధంగా కుల పెద్దలలో కులానికి సేవ చేసిన వారిని పేరుపేరునా ప్రస్తావిస్తూ కొంతమందిని పొగడడం జరిగింది. అందులో భాగంగా కులంలో ఎన్నో పోరాటాలు చేసి కుల ఐక్యత కోసం ఎన్నో కార్యక్రమాలు చేసిన కుడిపూడి సూర్యనారాయణరావు పేరును ప్రస్తావించడం జరిగింది. సూర్యనారాయణ రావు కులానికి చేసిన సేవలను చూసారే తప్ప అక్కడ పార్టీని చూడలేదు. ఆయనను కుల పెద్దగా గౌరవించి ఆయన గురించి మాట్లాడం జరిగింది. ఇటీవల కూతుర్ని కోల్పోయి కడు దుఃఖంలో ఉన్న రాజమండ్రి మాజీ కార్పొరేటర్ పిల్లి నిర్మల వారి గురించి అదే విధంగా కాకినాడకు చెందిన కడలి ఈశ్వరి కాలికి గాయమై విశ్రాంతిలో ఉంటూ కూడా ఈ సమావేశానికి హాజరైన వారిద్దరి గురించి కూడా ప్రస్తావించడం జరిగింది. ఇదేవిధంగా మరికొంతమంది పార్టీ నేతలు గురించి కూడా మాట్లాడారు కానీ రాజకీయం చేస్తూ కొంత మంది ప్రబుద్ధులు టిడిపికి చెందిన మంత్రి వాసనశెట్టి సుభాష్ వైసీపీ నేతలతో అంటగాగుతున్నారని ప్రచారం మొదలు పెట్టేసారు.ఇది వాసంశెట్టి శుభాష్ కు కొత్తేమీ కాదు తనపై వేసిన రాళ్లనే పీఠంగా మలుచుకుని ఎదుగుతున్న నాయకుడు వాసంశెట్టి శుభాష్. తన పని తాను చేసుకుంటూ 10 మందికి ఉపయోగపడుతూ సామాన్య కార్యకర్తగా మొదలైన ప్రస్థానం దేవుడి ఆశీస్సులతో ప్రజా దీవెనలతో ముందుకు వెళుతున్నారన్న విషయం గ్రహించుకోండి శెట్టి బలిజ కార్తీక వన సమారాధన సన్నాహక సమావేశం. దీనికి అన్ని పార్టీల శెట్టి బలిజ కుల సంఘ పెద్దలు హాజరైనారు. దయచేసి విమర్శకులు గమనించగలరు అని తెలియజేశారు.

# రోడ్ల మరమ్మత్తు పనులు మొదలుకాకపోవడంపై ఆగ్రహం



**ఆర్ఏఓ అంకిత్ కుమార్‌తో సమావేశంలో ఎమ్మెల్యే అశోక్**

**యానాం, విశ్వం వాయిస్ న్యూస్ :** యానాం పట్టణంలో పలుచోట్ల రహదారుల మరమ్మత్తు పనులకు టెండర్లుపూర్తయ్యి వర్క్ ఆర్డర్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు మొదలుపెట్టకపోవడంపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్ ఏ ఓ అంకిత్ కుమార్ ను కలిసి పలు అభివృద్ధి పనుల పై ఆయన మాట్లాడారు. పట్టణంలో పలుచోట్ల రహదారులు గోతులతో నిండియున్నాయని వాటి మరమ్మత్తులకు మూడు పనులు చొప్పున టెండర్లు అనంతరం వర్క్ ఆర్డర్లు ఇవ్వడం సైతం జరిగాయన్నారు. అయితే ఇప్పటివరకు పనులు ప్రారంభంకాకపోవడంతో కురుస్తున్న భారీవర్షాలకు వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వర్షం లేనప్పుడు పనులు మొదలుపెడితే ఇప్పటికే పూర్తయ్యేవన్నారు. జరిగే రోడ్డుప్రమాదాలకు అధికారులు, సంబంధింత కాంట్రాక్టర్ బాధ్యత వహించాల్సివుంటుందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ టిఎస్ రాజేశ్వరరావు పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మళ్లీ ఓఎన్జసి పైపులైను లీకేజీ.. అధికారులతో సమీక్ష**

గోదావరిలో ఓఎన్జిసి గ్యాస్ పైపులైను నుంచి శుక్రవారం మళ్లీ గ్యాస్ లీకేజీ అవుతున్న నేపథ్యంలో ఈ ఘటన గూర్చి ఓఎన్ జిసి అధికారులతో మాట్లాడానని ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. అదేవిధంగా ఆర్ఎఓ అంకిత్ కుమార్ తో సైతం మాట్లాడి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు.

# గోడి, గోడితిప్ప గ్రామాలలో కోటి సంతకాల సేకరణ



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అధ్యక్షతన, గోడితిప్ప గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ అధ్యక్షతన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగింది.ప్రజలు స్వచ్ఛందం గా పాల్గొని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా సంతకాలు చేస్తుంటే వైఎస్ఆర్సీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషారావు,కొనుకు బాపూజీ,జె సి ఎస్ అధ్యక్షులు తిక్క ప్రసాద్, గ్రామ కమిటీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,రేవు శ్రీను, ఎంపీటీసీలు పెచెట్టి వెంకటేశ్వరరావు, పల్లి జేమ్స్ రాజు, యువజన విభాగం అధ్యక్షులు బల్ల శ్యామ్, బొంతు సత్తిబాబు, కొల్లు సత్యనారాయణ, సాధనల శ్రీను, పెనుమాల విక్రమ్, మధుర శేఖర్, మల్లాడి రాధాకృష్ణ,లంకపల్లి సాయిరాం, పులుసుగంటి గంగాధర్, విప్పర్తి భద్రం, బొంతు గోపి, నున్నం యేసు, కొల్లు శ్రీను, పశ్చిమాల లీలా ప్రసాద్, బొంతు సత్యనారాయణ, కొనుకు బాబురావు, బొంతు నాగరాజు, గంటా శ్రీనివాసరావు, పచిమాల శ్రీను, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం : పిల్లి సూర్యప్రకాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పంట పొలాలు మునిగిపోయి రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారని రామచంద్రపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు.ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని శీలం వారి సావరం మరియు యనమదల గ్రామాల్లో నష్టపోయిన పంటలను పిల్లి సూర్యప్రకాశ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం రైతుల పరిస్థితిని గమనించిన ఆయన,పంట నష్టానికి తగిన పరిహారం ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, సర్పంచులు పంపన వీర వెంకటరమణ,యల్లమిల్లి సతీష్ కుమారి,నేదూరి జగజ్జీవన్ రావు,పెంకె వీర రాఘవులు, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, సీనియర్ నాయకులు రెడ్డి గోవిందు,కడలి కొండ పాటు రైతులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చెముడులంకలో వృద్ధుడి నేత్రదానం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో చెముడులంక గ్రామానికి చెందిన చోడపనీడి వీర్రాజు (81) వృద్ధాప్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. అయితే తన భర్త కళ్లు దానం చేయాలని వీర్రాజు భార్య సరస్వతి పట్టుపట్టడంతో వారి కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలు దానం చేయడానికి నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణనన్ నేత్ర వైద్యశాలకు సమాచారం ఇచ్చారు. ఆ లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెముడులంక వచ్చి వీర్రాజు నేత్రాలను సేకరించి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వీర్రాజు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా ఉన్న ఆయన నేత్రాలు ఆయనతో పాటు మంటల్లో కలిసిపోకుండా ఉండేందుకు ఇలా దానం చేసి మరో ఇద్దరికి చూపుని ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. వీర్రాజు నేత్రాలు దానం చేసిన ఆ కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

# పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయరాదు

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రభుత్వ మెడలు వంచుతాం.. - 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు
## వైయస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ : మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతగా ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలను తీసుకువస్తే... చంద్రబాబు వాటిని పీపీపీ విధానానికి మార్చి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆక్షేపించారు. అనపర్తి లో శుక్రవారం ఉదయం వైయస్ఆర్‌సిపి కార్యాలయంలో వైఎస్ఆర్‌సిపి ప్రజా ఉద్యమం పోస్టర్‌ని అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 28న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు)(అనపర్తి మండల పార్టీ కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్), సబ్బెళ్ళ కృష్ణారెడ్డి (అనపర్తి మార్కెట్ మాజీ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి), పోతుల ప్రసాద్ రెడ్డి(బుజ్జి) (బిక్కవోలు మండల పార్టీ కన్వీనర్), గుత్తుల వెంకటరమణ (పెదపూడి మండల పార్టీ కన్వీనర్), పేపకాయల వెంకటరమణ, కర్రి శ్రీ వెంకటరెడ్డి, కేత శ్రీనివాస్, నాగుమళ్ళ వీరభద్రరావు (వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి), అద్దంకి ముక్తేశ్వరరావు (రాష్ట్ర పార్టీ కార్యదర్శి(పార్లమెంట్)), వల్లభశెట్టి రామ సతీష్ (అనపర్తి నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు), వార కుమారి (అనపర్తి గ్రామ సర్పంచ్), నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణ రెడ్డి (రంగంపేట మండల వైయస్ఆర్‌సీపీ కన్వీనర్), కొండేటి భీమేశ్వర స్వామి (అనపర్తి నియోజవర్గం వైయస్ఆర్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు & ఎంపీటీసీ సభ్యులు), సత్తి సూరా రెడ్డి (పొలమూరు గ్రామ ఉప సర్పంచ్), సత్తి కనకా రెడ్డి (పొలమూరు గ్రామ ఎంపీటీసీ సభ్యులు), గుడాల మాచరావు, సత్తి హరి ప్రసాద్ రెడ్డి, వీరభత్తుల చంద్రశేఖర్ తదితర వైయస్ఆర్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# హాస్టల్ వార్డెన్‌ను ఉద్యోగం నుంచి భర్తరఫ్ చెయ్యాలి

## సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.. - ఈ కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలి..
## - విద్యార్థినిపై అఘాయిత్యా నికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి..

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలో ఇటీవల ప్రభుత్వ హాస్టల్ బాలికపై జరిగిన అత్యాచార సంఘటనకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ వారికి వినతిపత్రం ఇచ్చి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు, ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న అమానుషమైన సంఘటనలు ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో ఎక్కువయ్యాయని వాటిని నిర్మూలించడానికి కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకొని అవి మరలా రాష్ట్రంలో జరగకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులపై ఉందని



అన్నారు. రాజమహేంద్రవరంలో గవర్నమెంట్ హాస్టల్లో ఉన్న విద్యార్థినిపై జరిగిన సంఘటనలతో తల్లి దండ్రులు విద్యార్థినులను (ఆడపిల్లలను) బయటికి పంపాలంటే భయపడుతున్నారు. రాజమహేంద్రవరంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిపై కఠినాతి కఠినమైన సెక్షన్లను నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి త్వరగా విచారించి వారికి కఠినాతి కఠినమైన శిక్ష విధించాలని అన్నారు. అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్య వైఖరి వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ ని ఉద్యోగం నుండి తొలగించాలని సూచించారు. మహిళా కళాశాలలు, మహిళా హాస్టల్ లు వంటి వాటి దగ్గర ఇటువంటి సంఘటనలు జరగడానికి ఎక్కువగా ఆస్కారం ఉంటుందని అటువంటి చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేటట్టు అధికారులు చూడాలని, అక్కడికి పోలీసు వారిని ప్రతిరోజు పంపించి మానిటరింగ్ చేయమని సూచిస్తూ, లోగడ మహిళా కళాశాలల దగ్గరికి ఉదయం పూట పోలీసు వారిని పంపి మానిటరింగ్ చేసే వారిని అలాగే కళాశాలలు విడిచి పెట్టే సమయానికి కూడా పోలీసు వారిని పంపి మానిటరింగ్ చేసే వారిని, తగిన శాఖల మానిటరింగ్ ఈ మధ్యకాలంలో జరగటం లేదు. మానిటరింగ్ లేనందువలన ఇటువంటి సంఘటనలు జరగడానికి ఆస్కారం ఉంటుంది కనుక పోలీస్ వారిని పెట్రోలింగ్ నిమిత్తం మహిళా కళాశాలల దగ్గరకు ఉదయం పూట మరియు సాయంత్రం పూట వెళ్లేటట్టు ఏర్పాటు చేయాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులుమార్టిన్ లూథర్, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మోతా శారద, నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, రాజానగరం నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వడయార్, పిసిసి జనరల్ సెక్రెటరీ చిన్న మురళీకృష్ణ, కడియం నియోజకవర్గం ఇన్చార్జి కోఆర్డినేటర్ జె.టి రామారావు, ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, ఆల్ ఇండియా ఎన్.ఎస్.యు.ఐ పట్టాభి, ఎస్సీ కమిటీ బత్తిన చంద్రావు, దొంతుమల్ల రామ్ కుమార్, దయ్యాల రాజు, అమ్మాజీ, రామలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**మల్లవరం ఓఎన్‌జీసీలో 26 మందికి ఫైర్ సేఫ్టీలో**

# తిరిగి ఉద్యోగాలు ఇప్పించిన ఎంపీ హరీష్ బాలయోగి

## జీతాలు భారీగా పెంచేలా కృషి చేసిన ఎంపీ - కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పార్లమెంట్ పరిధిలోని మురమళ్ల నియోజకవర్గం మల్లవరం గ్రామంలో ఉన్న ఓఎన్‌జీసీ, హెచ్‌పి హెచ్‌టీ అసెట్ లో ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో పనిచేస్తున్న 26 మంది ఉద్యోగాలు కోల్పోయాయని భావించిన సదరు ఉద్యోగులకు అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి తిరిగి ఉద్యోగాలు ఇప్పించి వారిని ఆదుకున్నారు. ఈ మేరకు అమలాపురం పట్టణం ఎర్రవంతెన సమీపంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ హరీష్ పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు కంపెనీలో ఇటీవల నూతనంగా వచ్చిన కంపెనీ గత 16 ఏళ్లుగా అక్కడ




ఉద్యోగం చేస్తున్న 26 మందిని వివిధ కారణాలతో వేరే రాష్ట్రాలకు బదిలీ చేయడం లేదా ఉద్యోగాల నుండి తొలగించే ప్రయత్నం చేసింది.తమ గోడును ఎంపీ హరీష్ కు విన్నవించుకున్న ఉద్యోగులకు ఆయన భరోసా ఇచ్చి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి సదరు ఉద్యోగులను ఎటువంటి బదిలీ లేకుండా చేసి తిరిగి వారి ఉద్యోగాలు వారికే వచ్చేలా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తో కలిసి చర్యలు తీసుకున్నానని ఎంపీ చెప్పారు. అలాగే గత నెల రోజులుగా విధులు నిర్వహించక పోయినా సదరు కంపెనీతో మాట్లాడి నెల జీతం కూడా ఇప్పించడం జరిగిందన్నారు. అదేకాకుండా గతంతో 23 వేల రూపాయల జీతం ఉంటే దానిని పెంచి సుమారు 40 వేల రూపాయల వేతనం చెల్లించేలా ఆ కంపెనీ అధికారులతో చర్చలు జరిపి పెంచే విధంగా చేశానని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం పరిపాలనలో ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ఉద్యోగ భద్రతకు కూడా కృషి చేస్తామని ఎంపీ హరీష్ తెలిపారు.

**ఆనందం వ్యక్తం చేసిన ఉద్యోగులు**

తమ ఉద్యోగాలు తిరిగి పొందడమే కాకుండా జీతాలు కూడా పెరగడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.తమ జీవితాలలో వెలుగులు నింపిన ఎంపీ హరీష్‌ను గజమాలతో సత్కరించి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ ప్రగతి

**ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపేయ్యాలి - పుడమి తల్లి పచ్చదనాన్ని కాపాడుదాం**
**ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి**



**ఆలేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ ప్రగతి అని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి అన్నారు. అత్యద్భుత సుందర సుమనోహర దృశ్య కావ్యానికి నిదర్శనం ప్రకృతి అని ఆమె పేర్కొన్నారు. కానీ మన స్వార్థ పూరిత విధానాలతో ప్రకృతిని నాశనం చేస్తున్నామన్నారు. అడవులన్నీ హరించక పోయి వెంచర్లయి అయిపోయాయని ఆమె అన్నారు. అడవుల విస్తీర్ణం నానాటికీ తగ్గిపోతుండటంతో జంతువులకు ఆహారం దొరక్క జనావాసాల్లోకి వస్తున్నాయని, పంటలు అన్ని నష్టం చేస్తున్నాయని ఆమె విశ్లేషించారు. ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ ప్రగతి కావున ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపేసి, పుడమి తల్లి పచ్చదనాన్ని కాపాడుతూ చక్కని ఆకృతికై శ్రమిద్దాం అని ఆమె పిలుపునిచ్చారు. దయచేసి బరువనుకోక ప్రతి ఒక్కరూ బాధ్యతగ మొక్కలు నాటుదాం అని మంజుల అన్నారు.

# మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని, ప్రజారోగ్య పరి రక్షణకు కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలోని కె. గంగవరం మండల కేంద్రంలో శుక్రవారం పైప్ లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్,టి ట్రీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి సుభాష్ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పైప్‌లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్,టీ ట్రీ హాస్పిటల్స్,ఫౌండేషన్ బెంగళూరు సంస్థలు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల ప్రతినిధులను మంత్రి అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ లోకంలో ఎన్ని సంపదలు ఉన్నా ఆరోగ్యం లేకుంటే సమస్తం సూన్యమని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో ఆరోగ్య రామచంద్రపురం లక్ష్యంగా పలు ఆరోగ్య సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ తో బాధపడే వారికి గుంటూరు తరలించి కార్పొరేట్ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మందికి పైగా ఉచిత వైద్యం మందులు పొందారన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ప్రభుత్వం వైద్య రంగ బలోపేతానికి కృషి చేస్తుందన్నారు.సీఎం చంద్రబాబు ఆశయం మేరకు తమ ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు పాల్గొని బీపీ, షుగర్,ఈఎన్టీ,స్త్రీ వ్యాధులు (గర్భాశయ క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్ ),పురుషుల ప్రొస్టేట్ పరీక్షలు,కంటి పరీక్షలు (ఉచిత కళ్లజోళ్ల పంపిణీతో),దంత పరీక్షలు, ఫిజియోథెరపీ వంటి పలు వైద్య సేవలను అందించారు.అలాగే సి.బి.సి.,ఈ.సి.జి., డిజిటల్ ఎక్స్-రే వంటి ఉచిత నిర్ధారణ పరీక్షలు మందుల పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతకు వైద్య సేవ శిబిరాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పిల్ ఎండి అఖిల్ మల్హోత్రా,సీఈఓ ప్రదీప్ చౌహాన్,హెడ్ కె.దివాకర్, ఏపీ హెడ్ సత్య శ్రీనివాస్, సీనియర్ జీఎం కే ప్రసాద్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి సుభాష్,ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలతో సత్కరించారు.

# డిసెంబర్ నాటికి సముద్రపు కోత నిరోధక గోడ పనులు పూర్తి

నరసాపురం, మహానగర్

తీవ్ర వర్షం, ఈదురు గాలులు కొనసాగుతున్నా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పెద్దమానవా నిలంక గ్రామానికి వెళ్లి సముద్రపు కోత నిరోధక కట్ట పనులను పరిశీలించారు. ఈ ప్రాంతం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామం కావడంతో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లో కూడా అక్కడకు వెళ్లడం ద్వారా కలెక్టర్ ప్రజల పట్ల తన అంకితభావాన్ని ప్రదర్శించారు.
నిరంతర వర్షం కురుస్తున్న నేపథ్యంలో, కలెక్టర్ బురద నేలమీద నడుస్తూ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. రూ.13.5 కోట్ల సిఎస్ఆర్ నిధులతో ఒక కిలోమీటర్ పరిధిలో చేపట్టిన సముద్రపు కోత నిరోధక కట్టను డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేయాలని ఆమె అధికారులకు ఆదేశించారు.
"పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి," చదలవాడ అన్నారు. పనుల నాణ్యత, దృఢతపై ఇరిగేషన్ శాఖ



అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అననుకూల వాతావరణ పరిస్థితులను లెక్కచేయకుండా తీరప్రాంత ప్రజల భద్రత కోసం తానే స్వయంగా వెళ్ళటం ద్వారా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రజలలో విశ్వాసాన్ని కలిగించారు. ఈ చర్య జిల్లాలో ప్రజల భద్రత పట్ల కలెక్టర్ కు ఉన్న నిబద్ధతకు ప్రతీకగా నిలిచింది. మొత్తం ఒక కిలోమీటర్ కాగా ఇప్పటివరకు సుమారు 400 మీటర్ల పరిధిలో పనులు కొనసాగుతున్నాయి. వీటిలో 60 మీటర్లలో జియో ట్యూబ్ ఏర్పాటు, 200 మీటర్లలో జియో వాల్ నిర్మాణం పూర్తయిందని అధికారులు వివరించారు. ఈ వేగం అలాగే కొనసాగించాలని, నిర్ణయించిన గడువులోనే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
"ఈ కట్ట నిర్మాణం తీరప్రాంత ప్రజలకు భద్రత కల్పించే రక్షణ గోడలా మారాలి" అని అన్నారు. కలెక్టర్, సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలించి, ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఎగిసి పడుతున్న సముద్రపు అలలు, ఇతర పరిస్థితులను గమనించారు. ఈ సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్న వారు వెంటనే ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. "మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కొనసాగుతున్నందున జాగ్రత్తలు తప్పనిసరి," అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, ఇరిగేషన్ శాఖ ఈఈ సత్యనారాయణ, అగ్నిమాపక శాఖ అధికారి బి. శ్రీనివాసరావు, ఇంచార్జ్ తహసిల్దార్ ఎన్.ఎస్.ఎస్.వి. ప్రసాద్, గుత్తేదారులు, అధికారులు పాల్గొన్నారు.

# అప్పుల్లో మనమే టాప్

న్యూఢిల్లీ

సామాజిక, ఆర్థిక అంశాల్లో ముందంజలో ఉండే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కుటుంబాలు అప్పులు తీసుకోవటంలోనూ దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే ముందున్నాయి. ఇక మొత్తం దక్షిణాదిలో రెండు తెలుగు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతీ ఆరు నెలలకోమారు విడుదలయ్యే కేంద్ర గణాంకాలశాఖ జర్నల్ 'సర్వేక్షణ' ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం.. దేశంలోని వయోజనుల్లో అప్పు తీసుకున్న వారి సంఖ్య సగటున 15 శాతం కాగా.. దక్షిణాది రాష్ట్రాలన్నింటా ఇది 20 శాతానికిపైనే ఉంది. అన్నింట్లోకి అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవటం గమనార్హం. ఆ రాష్ట్రంలో అప్పు తీసుకున్న వయోజనుల సంఖ్య సగటున 43.7 శాతం. ఆ తర్వాత స్థానంలో తెలంగాణ 37.2 శాతంతో ఉంది. తదుపరి స్థానాల్లో కేరళ (29.9శాతం), తమిళనాడు (29.4శాతం), పుదుచ్చేరి (28.3శాతం), కర్ణాటక (23.2శాతం) ఉన్నాయి. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే.. ఛత్తీసగఢ్ 6.5శాతం, అస్సాం 7.1శాతం, గుజరాత్ 7.2శాతం, జార?ండ్ 7.5శాతం, పశ్చిమ బెంగాల్ 8.5శాతం, హరియాణా 8.9శాతం మంది రుణగ్రహీతలను కలిగి ఉన్నాయి. ఢిల్లీలో అత్యల్పంగా కేవలం 3.4 శాతం మంది మాత్రమే రుణం తీసుకున్నట్లు తెలిపారు.

**అగ్రస్థానంలో బీసీలు**

దేశంలో అప్పులు తీసుకుంటున్న వ్యక్తులను, కుటుంబాలను సామాజికవర్గాల ప్రకారం పరిశీలిస్తే.. 16.6 శాతంతో బీసీలు అగ్రస్థానంలో నిలువగా.. 11 శాతంతో ఎస్టీలు అత్యంత దిగువన ఉన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల పరంగా స్వల్ప తేడానే ఉంది (పట్టణాలు–14శాతం, గ్రామీణ ప్రాంతాలు–15శాతం). అలాగే మతాలవారీగానూ పెద్దగా తేడాల్లేవు. మహిళలకంటే పురుషులు, వివాహితులు, చిన్న కుటుంబాల వారు ఎక్కువగా అప్పులు తీసుకుంటున్నట్లు తేలింది. 2020–21లో నిర్వహించిన 78వ బహుళ ప్రయోజనకర సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా ఈ వివరాలను నమోదు చేశారు. సర్వేలో భాగంగా 15 లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారిని ప్రశ్నించారు. సర్వే సమయానికి కనీసం




రూ.500 లేదా అంతకంటే ఎక్కువ అప్పు ఉన్న వారి వివరాలు సేకరించారు. ఈ నివేదికపై ఆర్థిక నిపుణులు స్పందిస్తూ.. దక్షిణాది రాష్ట్రాల ప్రజల తలసరి ఆదాయం, ఆస్తులు ఎక్కువ కాబట్టి, రుణాలు తిరిగి చెల్లించే సామర్థ్యం ఉంటుందని, అందువల్లే రుణసంస్థలు వారికి అప్పులను గణనీయంగా ఇస్తున్నాయని పేర్కొన్నారు.

# పతనమైన ధరలు

న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే దేశంలోని మక్కజొన్న రైతులు నట్టేట మునిగిపోతారంటూ పత్రికల్లో కథనాలు వస్తున్న తరుణంలో భారతీయ మక్కజొన్న మార్కెట్ కుదుపునకు లోనవుతోంది. అమెరికా మక్కజొన్న భారత్‌లో అడుగుపెడితే భారతీయ రైతులు మట్టికొట్టుకుపోక తప్పదంటూ మీడియా కథనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో దేశంలోని అనేక రాష్ట్రాలలో మక్క ధరలు పతనమయ్యాయి. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కన్నా దాదాపు రూ. 600 తక్కువ ధర పలుకుతుండడంతో మక్కజొన్న రైతులో భవిష్యత్తుపై భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరి, అమెరికా మక్కజొన్న భారత్‌లోకి ప్రవేశిస్తే మక్క ధర దారుణంగా పతనమవుతుందని, రైతులు భారీ నష్టాలను ఎదుర్కోవలసి వస్తుందని వార్తాకథనాలు సూచిస్తున్నాయి. మక్క రైతులను మహరాజులను చేస్తామని గతంలో నమ్మబలికిన పాలకులు మక్క పంటను రైతులు ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు అమ్ముకుని నష్టాల పాలవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రపంచంలో పండించే మొత్తం మక్కజొన్నలో 35 శాతానికి పైగా అమెరికాలోనే పండుతుంది. భారతీయ వాటా కేవలం 3 శాతం మాత్రమే.
మక్కజొన్నకు ఎంఎస్‌పీని క్వింటాలుకు రూ. 2,400గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ ఏడాది అక్టోబర్ 15 నుంచి 23 మధ్య మక్క ఎంఎస్‌పీ సగటు ధర రూ. 1,823.53కి పడిపోయినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఏ2ంఎఫ్ఎల్(వాస్తవ ఖర్చులకు అదనంగా కుటుంబ శ్రమ విలువ కలిపి) కింద క్వింటాలు మక్కను పండించడానికి రైతు రూ.1,508 ఖర్చు చేస్తాడు. స్వామినాథన్ కమిషన్ సీ2 ఫార్ములా ప్రకారం చూస్తే రైతు క్వింటాలు మక్కకు రూ. 1,952 ఖర్చు పెడతాడు. దీన్ని బట్టి చాలామంది రైతులు తమ మక్క పంటను నష్టాలకు అమ్ముకుంటున్నట్లు అర్థమవుతుంది.

**ఎంపీలో పరిస్థితి దుర్భరం**

దేశంలో ఎక్కడా లేని విధంగా బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో మక్క ధరలు అత్యంత తక్కువగా ఉన్నాయి. అక్కడి రైతులు సగటున రూ. 1,552.49 ధరను మాత్రమే అందుకుంటున్నారు. కొన్ని మండీలలో అయితే ధర ఇంత కన్నా తక్కువకు పడిపోయింది. దేవస్ జిల్లాలోని ఖాటెగావ్ మండీలో క్వింటాలు మక్క ధర రూ.1,196.5కి పడిపోగా సెహోర్‌లోని నస్రుల్లాగంజ్ మండీలో ధర రూ.1,121కి పతనమై రైతులకు పుట్టెడు నష్టాన్ని మిగిల్చింది. దేశంలో పండే మొత్తం మక్కలో 12 శాతానికి పైగా పంట మధ్యప్రదేశ్‌లోనే పండుతుంది. రాజస్థాన్‌లో కూడా క్వింటాలు మక్కకు ఎంస్‌పీ కన్నా రూ. 700కి తక్కువగా రూ.1695.54 లభిస్తోంది. దేశంలోనే అత్యధికంగా మక్క పండించే రాష్ట్రమైన కర్ణాటకలో గతవారం క్వింటాలకు సగటు ధర రూ. 2,085.85 లభించింది. మహారాష్ట్రలో క్వింటాలుకు రూ. 1,763.85 లభించింది.

**రైతులు ఇక ఆ పంట వేయరు..**

గత కొన్ని సంవత్సరాలుగా మక్క రైతులకు లాభాలు



వస్తున్న కారణంగా చాలామంది రైతులు ఈ పంటపైనే ఆసక్తి చూపసాగారు. 2020–21లో 98.92 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మక్కను సాగుచేయగా 2024–25 నాటికి దీని విస్తీర్ణం 120.17 లక్షల హెక్టార్లకు పెరిగింది. అదే కాలంలో మక్క దిగుబడి కూడా 316.45 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 422.81 లక్షల మెట్రిక్ టన్నులకు పెరగింది. అయితే అమెరికా మక్కను దిగుమతి చేసుకోవడానికి మోదీ ప్రభుత్వం అనుమతించిన పక్షంలో దేశంలో మక్క ధరలు దారుణంగా పతనమై రైతులు ఇక ఆ పంట వేసేందుకు ఇష్టపడకపోవచ్చు. అదే పరిస్థితి వస్తే భారత్ ఇక మక్క దిగుమతులపై ఆధారపడక తప్పదు. ఇప్పటికే మన దేశం పప్పుధాన్యాలు, నూనె గింజల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. 'మక్కజొన్నను దిగుమతి చేసుకుంటే మన రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఆహారాన్ని దిగుమతి చేసుకుంటే నిరుద్యోగితను దిగుమతి చేసుకున్నట్లే. ప్రభుత్వం ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. చవకగా వచ్చే దిగుమతులు దేశీయ ధరలను అణచివేస్తాయి. మక్కను దిగుమతి చేసుకుంటే దేశంలో ఇక మక్కను పండించే రైతులు మిగలరు.'

# స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన

మైనారిటీల రక్షణ, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులను కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గట్టిగా స్పందించారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు. ఐరాస 80వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపు విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివాదాల యుగంలో శాంతి అవశ్యమని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఐక్యరాజ్య సమితిలో అంతా సరిగా లేదని అన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితిలో మార్పులు జరిగేలా సంస్కరణలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితికి భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని, అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. జాత్యాహంకారం, వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను స్విట్జర్లాండ్ ఎదుర్కొంటున్న సంగతిని ఆయన ప్రస్తావించారు.



## తెలుగువారిని ఏకం చేసిన మహనీయుడు కృష్ణారావు

**- టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు**



అవనిగడ్డ, మహానగర్

ప్రపంచవ్యాప్త తెలుగు వారిని ఏకం చేసిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అని టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మంత్రి, దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అవనిగడ్డ వంతెన సెంటరులో ఎంవీ కృష్ణారావు విగ్రహానికి గాంధీ క్షేత్రం రోడ్డు, రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ దుకాణదారులు మహమ్మద్ వాహెదుల్లా, అబ్దుల్ సాధిక్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
మండలి వెంకట కృష్ణారావు శత జయంతి, గాంధీ క్షేత్రం కమిటీ, మండలి అభిమానుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీసీ అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), యర్రంశెట్టి సుబ్బారావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, మాజీ ఎంపీపీ లుక్కా వెంకట పిచ్చియ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, కూటమి నాయకులు బండే రాఘవ, అన్నపరెడ్డి వెంకటస్వామి, ఆకుల సీతా మహాలక్ష్మి, గుగ్గిలం శ్యాం కుమార్, దేగల రాఘవ, బాలు శ్రీనివాస్, బచ్చు ఆదినారాయణ, దుకాణదారులు, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాలను బాధ్యతగా నిర్వహించాలి

**మౌలిక సౌకర్యాల కల్పన పనులు వేగవంతం చేయాలి**
**వర్షాల నేపథ్యంలో వసతి గృహాల వద్ద డ్రైనేజీలు పూడిక తీయించండి**
**సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

అవనిగడ్డ, మహానగర్



వసతి గృహాలను బాధ్యతగా నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానికులు ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ బీసీ సంక్షేమ వసతి గృహ అధికారుల సలహా సంఘ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరు మండలాల్లోని బీసీ వసతి గృహాల్లో మౌళిక సౌకర్యాలు, పరిస్థితులపై ఎమ్మెల్యే సమీక్షించారు. వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జరుగుతున్న పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డార్మెటరీలు, వంట గదుల్లో టైల్స్ వేసే పనులు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వసతి గృహాల్లోకి నీరు చేరకుండా డ్రైనేజీలు పూడిక తీయించాలని ఎంపీడీఓలకు సూచించారు. వసతి గృహాల్లో పిల్లలను అధికారులు తమ స్వంత బిడ్డల్లా చూసుకోవాలని, వారి వ్యక్తిగత భద్రత, ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ తుంగల సుమతి, ఎంపీడీఓలు మరియాదేవి, సుధాప్రవీణ్, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ సేవలు టెలికం సైబర్ సెక్యూరిటీ

న్యూఢిల్లీ



వాట్సాప్ నుంచి పేమెంట్ యాప్‌లు, ఆహారాన్ని సరఫరా చేసే యాప్‌ల వరకు.. మొబైల్ నంబర్ల ఆధారంగా డిజిటల్ సేవలందించే సంస్థలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం 'టెలికం సైబర్ సెక్యూరిటీ నియంత్రణ'ల పరిధిలోకి తెచ్చింది. సైబర్ నేరాలను అరికట్టేందుకు గాను టెలికమ్యూనికేషన్స్ (టెలికం సైబర్ సెక్యూరిటీ) సవరణ నిబంధనలు 2025ను ఈ నెల 22న నోటిఫై చేసింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. ఈ నిబంధనల ప్రకారం.. ఒకేసారి వేర్వేరు డిజిటల్ సేవలు పొందే వినియోగదారుల ఖాతాలను నిలిపివేసే అధికారాలు సంబంధిత సంస్థలకు ఉంటాయి. అలాగే వాడిన ఫోన్ల అమ్మకం లేదా కొనుగోలు చేసేముందు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే 'మొబైల్ నంబర్ వెరిఫికేషన్ (ఎంఎన్‌వీ)' వ్యవస్థలో డేటాబేస్ తనిఖీలు తప్పనిసరి చేసింది. దొంగిలించిన లేదా ఫోర్జరీ చేసిన మొబైల్ కనెక్షన్లు, ఫోన్ హ్యాండ్‌సెట్లతో చేస్తున్న సైబర్ నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. తాజా నిబంధనల్లో 'టెలికమ్యూనికేషన్ ఐడెంటిఫయర్ యూజర్ ఎంటైటీస్ (టీఐయూఈ)' అనే కొత్త విభాగాన్ని సృష్టించారు. లైసెన్స్డ టెలికం ఆపరేటర్లు మినహా ఫోన్ నంబర్ల ఆధారంగా వినియోగదారులను గుర్తించి, సేవలందించే వ్యాపార సంస్థలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. జొమాటో, స్విగ్గీ, ఫోన్‌పే, పేటీఎం, ఓలా, ఉబర్ వంటి సంస్థలు టీఐయూఈ విభాగంలోకి వస్తాయి. మెసేజింగ్ సేవల విషయంలో ఎయిర్‌టెల్, జియోలు కూడా ఈ కోవకే చెందుతాయి. కొత్త నిబంధనల మేరకు ఈ టీఐయూఈలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఫోన్ నంబర్లను సస్పెండ్ చేయడం, ఆయా సంస్థలు వాడే ఫోన్ నంబర్ల డేటాకు సంబంధించిన అభ్యర్థనలకు స్పందించడం, అధికారులు సూచించిన విధంగా వినియోగదారుల గుర్తింపును తనిఖీ చేయడం వంటివి చేయాల్సి ఉంటుంది. భద్రతా కారణాల రీత్యా ప్రభుత్వం ఒక ఫోన్ నంబరును నిలిపివేయవచ్చు. అలాగే ఆ నంబరు వినియోగాన్ని నిలిపివేయాలని టెలికం ఆపరేటర్లు, యాప్‌లను ఆదేశించవచ్చు. ప్రజాప్రయోజనాల రీత్యా ముందుగా ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే సంబంధిత సేవలను నిలిపివేయవచ్చు. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను అడ్డుకునేందుకే కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## బిజినెస్ వాయిస్

### రోజుకు 7 కిలోల బంగారం కొనుగోలు




అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు భగ్గుమంటున్నప్పటికీ.. సెంట్రల్ బ్యాంక్‌లు మాత్రం కొనుగోళ్లను ఆపడం లేదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) 200 కిలోల బంగారాన్ని కొనుగోలు చేసింది. రోజుకు సగటున 7 కిలోల బంగారాన్ని సొంతం చేసుకున్నట్లయ్యింది. ఈ ఏడాది బంగారం ధర 60 శాతం పైగా పెరిగినప్పటికీ.. ఇంత భారీ కొనుగోలుచేయడం గమనార్హం. దీంతో ఆర్‌బిఐ మొత్తం బంగారు నిల్వలు 880 టన్నుల స్థాయిని దాటింది. వీటి మొత్తం విలువ 95 బిలియన్ (దాదాపు రూ.8.34 లక్షల కోట్లు) డాలర్లుగా ఉంది. సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఏకంగా 600 కిలోల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఆర్థిక సంవత్సరం 2024-25 చివరి నాటికి 879.58 టన్నులుగా ఉన్న మొత్తం బంగారం నిల్వలు.. సెప్టెంబర్ చివరి నాటికి 880.18 టన్నులకు చేరింది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పెరుగుతున్న కారణంగా సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారానికి ఇటీవల చాలా డిమాండ్ పెరిగింది. ఈ కారణంగానే అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరిగాయి. ఈ కేంద్ర బ్యాంకులు, పెట్టుబడిదారులు ఆర్థిక ఆస్తిగా బంగారాన్ని నిరంతరం కొనుగోలు చేయడం వలన దేశీయ ధరలు కూడా పెరిగాయి. ఈ డిమాండ్ కారణంగానే సెప్టెంబర్ నెలలో బంగారం ధరలు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి.

### హెచ్‌యూఎల్ లాభం రూ. 2,694 కోట్లు




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) జులై- సెప్టెంబరు త్రైమాసికానికి హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ఏకీకృత ప్రాతిపదికన రూ.2,694 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే కాలంలో నమోదైన రూ.2,595 కోట్లతో పోలిస్తే లాభం 3.8 శాతం పెరిగింది. మొత్తం ఆదాయం 1.5 శాతం పెరిగి రూ.16,388 కోట్లుగా నమోదైంది. అమ్మకాలు స్వల్పంగా 2.1 శాతమే పెరిగాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాల బదిలీ ప్రభావం, దేశంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువ రోజులు కొనసాగడం ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. మొత్తం వ్యయాలు 3.32 శాతం పెరిగి రూ.12,999 కోట్లకు చేరాయి. వినియోగం పెరిగేందుకు తాజా జీఎస్‌టీ సంస్కరణలు దోహదం చేస్తాయని హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీ ప్రియా నాయర్ తెలిపారు. అయితే జీఎస్‌టీ రేట్ల మార్పులకు తగ్గట్లుగా మార్కెట్ సన్నద్ధం కావాల్సి ఉండటంతో జులై- సెప్టెంబరులో అమ్మకాలపై కొంత ప్రభావం పడిందని చెప్పారు... నవంబరు ప్రారంభం నుంచి తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని అన్నారు.

# ఎస్‌బీఐ కార్డ్ ఛార్జీలు పెంపు.. రూ.1000 దాటితే బాదుడే

మీరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన క్రెడిట్ కార్డులు వినియోగిస్తున్నారా? అయితే మీకో బిగ్ అలర్ట్. ఎస్‌బీఐ కార్డ్ ఛార్జీలు సవరించింది. వివిధ రకాల సేవలపై ఫీ పెంచుతున్నట్లు ఇటీవలే ప్రకటించింది. సవరించిన కొత్త ఛార్జీలను నవంబర్ 1, 2025 నుంచే అమలులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. దీంతో ఎస్‌బీఐ కార్డ్ యూజర్లు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే రూ.1000 దాటితేనే భారీగా ఛార్జీలు చెల్లించుకోవాల్సి వస్తుంది. ఎడ్యుకేషన్ పేమెంట్లు, డిజిటల్ వాలెట్ లోడింగ్, కార్డుల మార్పిడి వంటి ట్రాన్సాక్షన్లను ఈ కొత్త ఛార్జీలు ప్రభావితం చేయనున్నాయి. క్రెడ్, మొబి క్విక్, చెక్ వంటి థర్డ్ పార్టీ అప్లికేషన్లతో ఎడ్యుకేషన్ సంబంధిత చెల్లింపులు చేసినట్లయితే ఇకపై కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. లావాదేవీ మొత్తంలో 1 శాతం మేర ఛార్జీ చెల్లించాల్సి ఉంటుందని ఎస్‌బీఐ కార్డ్ వెల్లడించింది. అయితే నేరుగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పీఓఎస్ ద్వారా నేరుగా పేమెంట్లు చేసినట్లయితే వాటికి ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం చేసింది. వాలెట్ లోడింగ్ రూ.1000 దాటితే ఇకపై బాదుడే బాదుడు. వాలెట్ లోడింగ్ లావాదేవీలు రూ.1000కి మించి చేసినప్పుడు 1 శాతం ట్రాన్సాక్షన్ అమౌంట్ ఫీ చెల్లించాల్సి వస్తుంది. ఎంపిక చేసిన మెర్చంట్ కోడ్స్ పరిధిలోని లావాదేవీలకు ఈ కొత్త ఛార్జీలు ఉంటాయని ఎస్‌బీఐ కార్డ్ పేర్కొంది. థర్డ్ పార్టీ మెర్చంట్ల ఎడ్యుకేషన్ పేమెంట్ ఛార్జీలు మెర్చంట్ కేటగిరీ కోడ్‌ల ఆధారంగా విభజించింది. అవి ఎంసీసీ 8211, 8220, 8241, 8244, 8249, 8299గా తెలిపింది. నగదు చెల్లింపులు, చెక్ పేమెంట్స్, కార్డ్ రీప్లేస్మెంట్, ఆలస్యంగా చెల్లింపుల వంటి సర్వీసులకు ఛార్జీలు వసూలు చేస్తామని ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది. ప్రస్తుతానికి అయితే ట్రాన్సాక్షన్ ఛార్జీల్లో ఎలాంటి




మార్పు చేయలేదని తెలిపింది. ప్రస్తుతం నగదు పేమెంట్లకు రూ.250, పేమెంట్ ఆలస్యమైతే 2 శాతం ఫీ పడుతుంది. ఇది కనీస ఫీ రూ.500గా ఉంటుంది. చెక్ పేమెంట్ ఛార్జీలు రూ.200గా ఉన్నట్ల తెలిపింది. క్యాష్ అడ్వాన్స్ ఫీ ఎస్‌బీఐ ఏటీఎ కేంద్రాల్లో, ఇతర దేశీయ ఏటీఎంలల్లో 2.5 శాతంగా నిర్ణయించింది. కనీసం రూ.500గా పేర్కొంది. ఇంటర్నేషనల్ ఏటీఎంల్లో క్యాష్ అడ్వాన్స్ ఫీ 2.5 శాతంగా వసూలు చేస్తున్నట్లు తెలిపింది. కార్డ్ రీప్లేస్మెంట్ ఛార్జీలు రూ.100 నుంచి రూ.250 మధ్య నిర్ణయించింది. ఆరమ్ కార్డులకు అయితే రూ. 1500 వరకు ఉంటుంది. విదేశాల్లో ఎమర్జెన్సీగా కార్డ్ మార్చుకోవాలంటే కనీస ఫీ వీసా కార్డులకు అయితే 175 డాలర్లుగా ఉన్నట్లు తెలిపింది. మాస్టర్ కార్డులకు అయితే 148 డాలర్లుగా నిర్ణయించింది. లేట్ పేమెంట్ ఛార్జీలు రూ.500 వరకు జీరోగా ఉండగా రూ. 500 నుంచి రూ. 1000 వరకు అయితే రూ. 400 పడుతుంది. రూ.1000 నుంచి రూ.10 వేల పేమెంట్లపై రూ.750 వరకు ఫీ కట్టాలి. రూ. 10 వేల నుంచి రూ. 25 వేల వరకు లేట్ పేమెంట్లు అయితే రూ. 950 వరకు ఫీజు పడుతుంది. రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు అయితే రూ.1100 మేర లేట్ పేమెంట్ ఛార్జీలు పడతాయి.

# లారస్ ల్యాబ్స్ ఆకర్షణీయ ఫలితాలు

లారస్ ల్యాబ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి ఆకర్షణీయమైన ఫలితాలు నమోదు చేసింది. త్రైమాసికాదాయం రూ.1,653 కోట్లు ఉండగా, దీనిపై రూ.195 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.1,224 కోట్లు, నికరలాభం రూ.20 కోట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పోల్చితే ప్రస్తుత రెండో త్రైమాసికంలో ఆదాయం 35 శాతం పెరిగినట్లు అవుతోంది. నికర లాభం ఇంకా అధికంగా పెరిగింది. వాటాదార్లకు ఒక్కో షేరుకు 80 పైసల చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలానికి లారస్ ల్యాబ్స్ రూ.3,223 కోట్ల ఆదాయం, రూ.358 కోట్ల నికర లాభం, రూ.6.6 ఈపీఎస్ నమోదు చేసింది. ఎబిటా మార్జిన్




25.4 శాతం ఉండటం ప్రత్యేకత. ఏఆర్వీ విభాగంలో నాయకత్వ స్థానాన్ని కొనసాగిస్తున్నట్లు అదే సమయంలో సీడీఎంఓ విభాగంలో విస్తరిస్తున్నట్లు లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావ వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం సమీపంలో తమకు భూమి కేటాయించిందని, దీన్ని భవిష్యత్తులో చేపట్టే విస్తరణ అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు. ఏడీసీ (యాంటీ బాడీ డ్రగ్ కంజుగేట్స్) సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించి, సేవలను విస్తరించే లక్ష్యంతో ఆర్విక్ థెరప్యూటిక్స్ అనే సంస్థలో 2 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. నికర రుణ పరపతి (నెట్ డెట్ లెవరేజ్) గత ఏడాదితో పోల్చితే గణనీయంగా తగ్గినట్లు (1.3ఐ ఎబిటా) సీఎఫ్ఓ రవికుమార్ వెల్లడించారు. అదే సమయంలో మూలధన పెట్టుబడులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా సంస్థకు, వాటాదార్లకు అధిక విలువ తెచ్చిపెట్టే సీడీఎంఓ/ సీఎంఓ వ్యాపారావకాశాలపై దృష్టి సారిస్తున్నామని ఆయన వివరించారు.

# తెలివి తక్కువ నిర్ణయం: టీమిండియా మేనేజ్‌మెంట్‌పై అశూ ఫైర్

ఆస్ట్రేలియాతో రెండో వన్డేలో టీమిండియా ఓటమిపై భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. అడిలైడ్ మ్యాచ్‌లో భారత జట్టు యాజమాన్యం అనుసరించిన వ్యూహాన్ని తప్పుబట్టిన అశూ.. తెలివి తక్కువ నిర్ణయం కారణంగా సిరీస్ కోల్పోయామంటూ ఘాటు విమర్శలు చేశాడు. కాగా మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడేందుకు ఆస్ట్రేలియా వెళ్లింది టీమిండియా. తొలుత వన్డే సిరీస్ మొదలుకాగా పెర్త్‌లో ఏడు వికెట్ల తేడాతో ఓడిన గిల్ సేన.. గురువారం నాటి రెండో వన్డేలో రెండు వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. తద్వారా 0-2తో సిరీస్‌ను ఆసీస్‌కు కోల్పోయింది.

**బెంచ్‌కే పరిమితం**

అయితే, ఈ రెండు వన్డేల్లోనూ చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేసింది టీమిండియా మేనేజ్‌మెంట్. వికెట్ల తీయగల సత్తా ఉన్నా అతడిని తుది జట్టుకు ఎంపిక చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

**జంపా అదుర్స్**

ముఖ్యంగా రెండో వన్డేలో ఆసీస్ స్పిన్నర్ ఆడం జంపా నాలుగు వికెట్లతో రాణించి.. భారత బ్యాటింగ్ ఆర్డర్ పతనాన్ని శాసించడం.. కుల్దీప్ లేనిలోటును మరింత ఎత్తి



చూపింది. ఆతిథ్య జట్టు తమ స్పిన్నర్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే.. టీమిండియా మాత్రం వ్యూహాత్మక తప్పిదం చేసిందనే విమర్శలు వచ్చాయి.

**వికెట్లు తీసే బౌలర్లు కావాలి**

ఈ నేపథ్యంలో రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. "అడిలైడ్ వన్డేలో టీమిండియా బౌలింగ్ అటాక్ అత్యంత సాధారణంగా అనిపించింది. అసలు వికెట్ తీయాలని ఎవరూ ప్రయత్నించినట్లుగా అనిపించనేలేదు. పరుగులు చేయడం కంటే కూడా వికెట్లు పడగొట్టగలిగే బౌలర్లను ఎంపిక చేసుకోవాలి.

**మంచి కెప్టెన్లు, నాయకులు ఎలా ఆలోచిస్తారంటే**

ఆడం జంపా నాలుగు వికెట్లు ఎలా తీశాడో చూశారా?.. అతడు బంతిని తిప్పేశాడు. ప్రతిసారీ మన డ్రెసింగ్‌రూమ్ దృష్టికోణం గురించే ఆలోచించవద్దు. మంచి కెప్టెన్లు, నాయకులు.. ఎల్లప్పుడూ ప్రత్యర్థి జట్టు ఎలాంటి ప్రణాళికలు రచిస్తుందో ముందే ఊహించి.. అందుకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకుంటారు. ఈ మ్యాచ్‌లో ఆడిన కూపర్ కన్నోలి ఇది వరకు అసలు కుల్దీప్ యాదవ్‌ను ఎదుర్కొన్నాడా? లేదు కదా!.. మరి మాథ్యూ షార్ట్.. అలెక్స్ క్యారీ కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో ఇబ్బందిపడ్డాడు. మిచెల్ ఓవెన్ కూడా ఇంత వరకు కుల్దీప్‌ను ఎదుర్కొనేలేదు.

**తెలివి తక్కువ నిర్ణయం**

ఆస్ట్రేలియా ప్రస్తుత బ్యాటింగ్ లైనప్‌లో చాలా మందికి కుల్దీప్ బౌలింగ్‌లో ఆడిన అనుభవమే లేదు. కాబట్టి అతడిని ఆడిస్తే.. ప్రత్యర్థి జట్టులోని ప్రతి బ్యాటర్ ఇబ్బంది పడేవాడు. కుల్దీప్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం తెలివిగల నిర్ణయం అయితే కానేకాదు" అని అశ్విన్.. కెప్టెన్ శుబ్‌మన్ గిల్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాడు.

## ట్రోఫీ కోసం గంటకుపైనే ఎదురుచూశాం.. సెలబ్రేషన్ ఆలోచన అతడిదే..!

ఆసియా కప్ ఫైనల్లో గెలుపొందిన భారత జట్టుకు ఇప్పటికీ ట్రోఫీ అందలేదు. రెండు నెలలు కావొస్తున్నా ఆసియా క్రికెట్ మండలి చీఫ్ మొహ్సిన్ నఖ్వీ వ్యవహారంతో ట్రోఫీ దుబాయ్‌లోనే ఉండిపోయింది. భారత క్రికెటర్లలో ఎవరో ఒకరు వస్తే.. తాను ఆసియా కప్‌ను ఇస్తానని నఖ్వీ అంటున్నాడు. అయితే.. అందుకు బీసీసీఐ సుముఖంగా లేదు. ఈ నేపథ్యంలో ఫైనల్లో పాకిస్థాన్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ మ్యాచ్ అనంతరం ఏం జరిగిందో వివరించాడు. ట్రోఫీ కోసం జట్టు సభ్యులంతా గంటకుపైనే ఎదురుచూశామని, అయినా తమకు ట్రోఫీ ఇవ్వలేదని తిలక్ వెల్లడించాడు. ఆసియా కప్ ఫైనల్ హీరోగా ప్రశంసలు అందుకుంటున్న తిలక్ వర్మ తాజాగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఛాంపియన్స్' అనే టీవీ షోలో మాట్లాడాడు. మూడేళ్ల క్రితం నాటి రాబ్డోమయోలిసిస్ సమస్య నుంచి బయటపడిన తీరుతో పాటు ఆసియా కప్ ఫైనల్ గురించి మాట్లాడాడు. తొమ్మిదోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా ట్రోఫీ లేకుండానే సెలబ్రేట్ చేసుకుంది. యావత్ క్రీడాలోకాన్ని ఆశ్చర్యానికి గురి చేసిన నవంబర్ 28 రోజు గురించి మరింత సమాచారాన్ని సందర్భంగా వెల్లడించాడీ హిట్టర్. తర్వాత ఏం జరిగిందో కూడా వెల్లడించాడు. 'మ్యాచ్ పూర్తయ్యాక ఏసీసీ



చీఫ్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ, విజేతలకు ఇచ్చే అవార్డులు అందుకోవద్దని నిర్ణయించుకున్నాం. ఇదే విషయాన్ని మేనేజ్‌మెంట్‌కు తెలియజేశాం. దాంతో, నఖ్వీతో వారు చర్చిస్తున్నారు. ఆ సమయంలో సభ్యులం మైదానంలో ట్రోఫీ కోసం గంటసేపు ఎదురుచూశాం. మీరు టీవీలో చూసే ఉంటారు. నేను.. మరికొందరం గ్రౌండ్‌మీద నడుంవాల్చి మాట్లాడుకుంటున్నాం. అర్ష్‌దీప్ ఇన్‌స్టా రీల్స్ తీస్తూ సందడి చేశాడు. ఏ క్షణంలోనైనా ట్రోఫీ తీసుకునేందుకు రావాలి అనే పిలుపు వస్తుందని అందరం అనుకున్నాం. కానీ, గంట దాటినా ట్రోఫీ మాకు ఇవ్వలేదు. 'ఏమైందబ్బా' అని మైదానం అంతా చూశాం. అప్పటికి ట్రోఫీ అక్కడ లేదు. మనం ఛాంపియన్లం కాబట్టి కప్ లేకుండానే సెలబ్రేట్ చేసుకుందామని అర్ష్‌దీప్ సింగ్ అన్నాడు. అందుకు.. నేను, అభిషేక్ శర్మ.. మరికొందరం ఓకే చెప్పాం. ఇదే విషయాన్ని కెప్టెన్ సూర్యకుమార్‌కు చెబితే అతడూ సరేనన్నాడు. దాంతో.. ట్రోఫీ లేకున్నా ఉన్నట్టు భావించి సెలబ్రేట్ చేసుకున్నాం' అని అని తిలక్ వివరించాడు.

## క్రీడా వాయిస్

### ఏడు మ్యాచుల్లో ఒకేఒక ఫిఫ్టీ.. సిడ్నీలో కోహ్లీకి కఠిన పరీక్ష..!

వన్డేల్లో రన్ మెషీన్‌గా పేరొందిన విరాట్ కోహ్లీ తనకెంతో ఇష్టమైన ఆస్ట్రేలియా పర్యటనలో మాత్రం నిరాశపరుస్తున్నాడు. యాభై ఓవర్ల ఫార్మాట్లో 'ఛేజ్ మాస్టర్'గా ఓ వెలుగు వెలిగిన అతడు.. ఇప్పుడు ఖాతా తెరిచేందుకు అపసోపాలు పడుతున్నాడు. పెర్త్, అడిలైడ్‌లో సున్నాకే



ఔటైన విరాట్.. వీడ్కోలు వార్తలకు ఆజ్యం పోస్తున్నాడు. అయితే.. వెటరన్ ప్లేయర్ అయిన కోహ్లీ కుదురుకున్నాడంటే దంచేస్తాడని, కాస్త టైమ్ తీసుకుంటే సిడ్నీ వన్డేలో విశ్వరూపం చూపిస్తాడని విశ్లేషకులు అంటున్నారు. అభిమానులు కూడా అదే కోరుకుంటున్న వేళ.. సిడ్నీలో మాత్రం ఈ దిగ్గజ ఆటగాడి రికార్డు ఏమంత ఘనంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆస్ట్రేలియాతో పోటీగా ఆడలేక వరుసగా రెండు ఓటములతో సిరీస్ కోల్పోయిన భారత జట్టు మూడో వన్డేలో విజయంపై కన్నేసింది. ఈ మ్యాచ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఎంత ముఖ్యమో.. కోహ్లీకి అంతకంటే చాలా ముఖ్యం. ఎందుకంటే.. భారీ అంచనాలతో క్రీజులోకి వచ్చిన అతడు.. రెండు డక్స్‌తో అందర్నీ విస్తుపోయేలా చేశాడు. అందుకే.. చివరిదైన మూడో వన్డేలో కోహ్లీ తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాలనే పట్టుదలతో ఉన్నాడు. కానీ, ఆ మైదానంలో అతడి రికార్డేమీ ఘనంగా లేదు. ఇప్పటివరకూ అక్కడ ఏడు మ్యాచుల్లో మాజీ కెప్టెన్ ఒకేఒక హాఫ్ సెంచరీ సాధించాడు. అది కూడా ఐదేళ్లక్రితం (89 నాటౌట్). ఈ మైదానంలో మొత్తంగా 24.33 సగటుతో 146 రన్స్ చేశాడంతే. ప్రస్తుతం అతడి ఫామ్ చూస్తుంటే.. మూడో వన్డేలో అతడికి పిచ్ నుంచే కాకుండా కంగారూ పేసర్ల నుంచి కఠిన పరీక్ష ఎదురవ్వనుంది.

**మునపటి కోహ్లీని తలపిస్తాడా?**

రెండేళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్‌లో దంచేసిన విరాట్.. ఆపై టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ, ఐపీఎల్‌లోనూ చెలరేగిపోయాడు. పొట్టి క్రికెట్, టెస్టులకు వీడ్కోలు పలికిన కోహ్లీ.. ప్రస్తుతం కొనసాగుతున్న ఫార్మాట్ వన్డే మాత్రమే. రెండేళ్లలో ప్రపంచ కప్ ఉన్నందున జట్టులో చోటు ఆశిస్తున్న విరాట్.. అందివచ్చిన అవకాశాన్ని మాత్రం చేజార్చుకుంటున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనతో వీరకొట్టుడుతో మునపటి కోహ్లీని తలపిస్తాడని భావించిన ఫ్యాన్స్‌ను ఉసూరుమనిపించాడీ వెటరన్. తొలి వన్డేలో 8 బంతులు ఎదుర్కొని కవర్స్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అడిలైడ్ వన్డేలోనూ నాలుగు బంతులాడినా.. ఎల్బీగా ఔటై నిరాశపరిచాడు. అనంతరం పెవిలియన్ వెళ్తూ.. మొహం చూపించలేక తన గ్లోవ్స్ తీసి ప్రేక్షకులకు చూపించాడు. 50 ఓవర్ల ఆటలో టన్నుల కొద్దీ పరుగులు.. అత్యధిక సెంచరీలతో రికార్డు బ్రేకర్‌గా నిలిచిన విరాట్ చివరిదైన సిడ్నీ వన్డేలో బ్యాట్ ఝులిపించాలని యావత్ క్రీడాలోకం కోరుకుంటోంది.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com



## ప్లాస్టిక్ సర్జరీపై స్పందించిన జాన్వీ

అందం కోసం హీరో, హీరోయిన్లే కాకుండా సాధారణంగా ప్రజలు కూడా పలు ప్రయత్నాలు చేస్తున్నారు. బ్యూటీ పార్లర్స్‌కు వెళ్లడం పలు విధాల ప్రయత్నాలు చేస్తూ అందంగా మారిపోతున్నారు. ఇక హీరోయిన్ల విషయానికొస్తే.. ఇండస్ట్రీలో రాణించేందుకు ఎంతకైనా తెలగించేస్తారు. కొందరు గ్లామన్ డోస్‌తో పాపులారిటీ దక్కించుకుంటే.. మరికొందరు మాత్రం తమ అందంతోనే మంత్రముగ్దులను చేస్తుంటారు. ఇంకా కొందరైతే.. ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకుని తమ బాడీలో సరిగ్గా లేని భాగాన్ని సరి చేసుకుంటుంటారు. ఇలా సినిమా ఇండస్ట్రీలో ఎంతోమంది ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారు. ఇక అతిలోక సుందరి శ్రీదేవి కూతురుగా వచ్చిన జాన్వీ కపూర్ కూడా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈక్రమంలో.. తాజాగా, జాన్వీ కపూర్ 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో పాల్గొని క్లారిటీ ఇచ్చింది. ''నా ప్రతి నిర్ణయం వెనుక మా అమ్మ సలహా ఉంది. ఆమె అనుభవం వల్ల నేను తప్పులు చేయకుండా ఉంటున్నాను. యువతులు సోషల్ మీడియాలో చూసిన దాన్ని బ్లైండ్‌గా ఫాలో అవ్వకూడదు. ఎవరో చేసినట్లు మనం సర్జరీ చేయించుకోవాలని అనుకోవడం ప్రమాదకరం. అందుకే పారదర్శకత చాలా ముఖ్యం. ఎవరో డాక్టర్‌లుగా నటిస్తూ, ఒక నటికి చేసిన సర్జరీల లిస్ట్ చూపిస్తూ వీడియోలు చేస్తారు. అలా నా ఫొటో పెట్టి బఫెలో ప్లాస్టీ చేసుకుందట అని చెప్పారు. అది చూసిన నేను షాక్ అయ్యా. అలాంటి తప్పుడు సమాచారం విని ఎవరైనా యువతి ప్రయత్నించి ఏదైనా తప్పు జరిగితే, అది భయంకరమైన విషయం యువతులు తమ శరీరాన్ని ప్రేమించాలి. మనం మనల్ని అంగీకరించడం సిగ్గు కాదు. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు మన మనసును ప్రభావితం చేయొద్దు.



# సుమ తనయుడి కొత్త సినిమా.. క్రేజీ సాంగ్ వచ్చేసింది

యాంకర్ సుమ తనయుడు రోషన్ హీరోగా వస్తోన్న తాజా చిత్రం 'మోగ్లీ' ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్ రిలీజ్ చేయగా ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. బబుల్‌గమ్ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రోషన్.. ప్రస్తుతం సందీప్ రాజ్‌తో జతకట్టారు. ఈ చిత్రంలో రోషన్ సరసన సాక్షి మడోల్కర్ హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా ఈ మూవీ నుంచి లవ్ అండ్ రొమాంటిక్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. సయ్యారే అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ పాటకు చంద్రబోస్ లిరిక్స్ అందించగా.. కాల భైరవ, ఐశ్వర్య దరూరి ఆలపించారు. ఈ సినిమాకు కాల భైరవ సంగీతమందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫారెస్ట్ నేపథ్యంలో సాగే రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బండి సరోజ్ కుమార్, హర్ష చెముడు కీలక పాత్రలు పోషించారు. కాగా.. మోగ్లీ డిసెంబర్ 12న థియేటర్లలో సందడి చేయనుంది.

## 'జటాధర' లోని జో లాలీ జో సాంగ్ ప్రోమో రిలీజ్

టాలీవుడ్ నటుడు సుధీర్ బాబు తన తదుపరి చిత్రం 'జటాధర' తో ప్రేక్షకులను అలరించడానికి సన్నద్ధమవుతున్నాడు. ఈ సినిమాలో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హాను ముఖ్యమైన పాత్రలో నటించారు. వెంకట్ కల్యాణ్ మరియు అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించిన ఈ తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం తెలుగు మరియు హిందీలో నవంబర్ 7న విడుదల కానుంది. తాజాగా ఇప్పుడు మూవీ మేకర్స్ ఈ సినిమాలోని జో లాలీ జో సాంగ్ ప్రోమోని విడుదల చేసారు. అక్టోబర్ 24న ఈ ఫుల్ లిరికల్ సాంగ్ ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేసేందుకు ప్రొడక్షన్ హౌస్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ ప్రాజెక్టును ఉమేష్ కెఆర్ బన్సాల్, ప్రెర్నా అరోరా, శివన్ నారంగ్ మరియు నిఖిల్ నంద భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శిల్ప షిరోడ్కర్, రవి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా ఒక ఫాంటసీ సూపర్‌నేచురల్ థ్రిల్లర్‌గా ప్రచారం చేయబడింది. శివన్ నారంగ్, ప్రేరణ అరోరా, నిఖిల్ నందా మరియు ఉజ్వల్ ఆనంద్ ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీ మ్యూజిక్ కంపెనీ సౌండ్‌ట్రాక్ ఉంది.






## పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మహేష్ బాబు కాంబోలో మల్టీ స్టారర్?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ షెడ్యూల్ ఇప్పుడు చాలా బిజీగా ఉంది. డైరెక్టర్ మారుతీ దర్శకత్వంలో రాజాసాబ్ అనే సినిమా చేస్తుండగా, ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే, హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వస్తున్న ఫౌజీ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరికొన్ని రోజుల్లో ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న స్పిరిట్ మూవీ కూడా షూటింగ్ ప్రారంభం కానుంది. వీటి తర్వాత కల్కి సీక్వెల్, సలార్ సీక్వెల్ చిత్రాలు చేయనున్నాడు. ఇక అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు కావడంతో ఫ్యాన్స్, సినీ ప్రముఖులు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. డార్లింగ్ మూవీస్ నుంచి పలు అప్డేట్స్ రాగా, అవి అభిమానులకు సంతోషాన్ని కలిగించాయి. ఈ క్రమంలో, సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రభాస్ సినిమా ప్రస్తావన కూడా వచ్చింది. దివంగత నటుడు కృష్ణంరాజు.. మహేష్%-%ప్రభాస్ కాంబోలో ఒక క్రేజీ మల్టీస్టారర్ సినిమాను చేయాలనుకున్నారట. ఆ సమయంలో డైరెక్టర్ మురగదాస్ వీరిద్దరి కోసం ప్రత్యేక స్టోరీ కూడా రెడీ చేసినట్లు టాక్. అయితే, ఇద్దరు హీరోలు ఇప్పటికే ఇతర ప్రాజెక్టలలో బిజీగా ఉండడంతో, ఆ ప్రాజెక్ట్ ఆగిపోయినట్లు సమాచారం. ఈ మల్టీస్టారర్ ఇప్పుడు చేస్తే పాన్ ఇండియా లెవల్లో బ్లాక్ బస్టర్ కావడం ఖాయం అంటూ జోస్యాలు చెబుతున్నారు. ప్రభాస్- మహేష్ బాబుని ఒకే తెరపై చూస్తే ఆ కిక్కే వేరప్పా అని అంటున్నారు.




# రెడ్ డ్రెస్‌లో సెగలు పుట్టిస్తోన్న శ్రీలీల

ఈ మధ్య అందాల ముద్దుగుమ్మ శ్రీలీల గ్లామర్ డోస్ పెంచుతూ, యూత్‌కు నిద్రలేకుండా చేస్తుంది. రోజు రోజుకు తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అందంతో అందరినీ మాయ చేస్తుంది. పెళ్లి సందడి మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన చిన్నది శ్రీలీల. ఈ ముద్దుగుమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. మొదటి హిట్ అవ్వకపోయినా, ఈ అమ్మడు మాత్రం అందరి మనసు దోచేసుకుంది. తన డ్యాన్స్, నటన, అందంతో అందరినీ ఆకట్టుకుంది. పెళ్లి సందడి తర్వాత ఈ ముద్దుగుమ్మకు వరసగా అవకాశాలు తలపు తట్టాయి. వచ్చిన ప్రతి ఛాన్స్ మిస్ చేసుకోకుండా, వరసగా లు చేస్తూ తన అభిమానులను అలరిస్తుంది. ముఖ్యంగా ఈ బ్యూటీ దరవు తో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీ తర్వాత చాలా లు చేసినప్పటికీ అవి డిజాస్టర్ అయ్యాయి. దీంతో ఈ చిన్నదానికి తెలుగులో ఆఫర్స్ కాస్త తగ్గాయి. తర్వాత మళ్లీ పుష్ప2 లో కిసక్కీ డ్యాన్స్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఈ సాంగ్‌లో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీని తర్వాత ఈ చిన్నదానికి వరసగా ఆఫర్స్ క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, తాజాగా రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com